




పీఎం పాలెంలోని 'వి' కన్వెన్షన్ హాలులో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు పరుగులు పెట్టిస్తున్నాం..

- టీసీఎస్ వచ్చింది, గూగుల్ డేటా సెంటర్ కూడా వస్తుంది



వి కన్వెన్షన్ హాలులో కార్యకర్తలకు అభివాదం చేస్తున్న సీఎం చంద్రబాబునాయుడు

ముంబైకి దీటుగా విశాఖ అభివృద్ధి

- సివిల్ ఏవియేషన్ యూనివర్సిటీ కూడా ఏర్పాటుచేయబోతున్నాం
- అనకాపల్లి జిల్లాలో మిట్టల్ స్టీల్ ప్లాంటు, ఫార్మా పరిశ్రమలు
- సింగపూర్ నుంచి విశాఖకు సముద్ర మార్గంలో కేబుల్
- రాష్ట్రమంతా ఒక ఎత్తైతే.. విశాఖ మరో ఎత్తు
- ఇక్కడి ప్రజలకు రుణపడి ఉంటా
- ఉమ్మడి విశాఖపట్నం జిల్లా కార్యకర్తల సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు
- ప్రతి ఒక్కరూ యోగాంధ్రలో భాగస్వాములు కావాలని పిలుపు

విశాఖపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): **ప్రకృతి వనరులకు ఆలవాలమైన విశాఖపట్నం అంటే తనకు ఎంతో ఇష్టమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. నగరాన్ని ముంబైకు దీటుగా అభివృద్ధి చేస్తానని, అందుకు ప్రణాళికలు తయారు చేశామన్నారు.**

సోమవారం సాయంత్రం పీఎం పాలెంలోని 'వి' కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన ఉమ్మడి విశాఖపట్నం జిల్లా కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. విశాఖ ప్రజలకు తాను రుణపడి ఉంటానని, విశాఖకు ఎంత చేసినా తక్కువేనన్నారు. రాష్ట్రంలో తలసరి ఆదాయం అత్యధికంగా ఉన్న నగరం విశాఖ అని గుర్తు చేశారు. భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు ... మిగతా 4వ పేజీలో

మనది కుటుంబ అనుబంధం..

పార్టీ కార్యకర్తలంతా తనకు ప్రాణ సమానులైన కుటుంబ సభ్యులని చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. సమావేశానికి ఐదారు గంటలు ఆలస్యమైనా కార్యకర్తల ఎనర్జీ ఏమాత్రం తగ్గలేదన్నారు. కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే ఎన్ని జన్మలు ఎత్తినా తెలుగుదేశం పార్టీ కుటుంబంలోనే పుట్టాలనిపిస్తోందన్నారు. 'మనది రాజకీయ అనుబంధం కాదు. కుటుంబ అనుబంధం' అని పేర్కొన్నారు. '45 ఏళ్లుగా చూస్తున్నా. నాతోపాటు మీరు కూడా ప్రజాసేవలో పునీతమయ్యారు. కరెక్ట్‌గా ప్లాన్ చేస్తే వేరే వాడు ఎవడూ ఏమీ చేయలేడు' అన్నారు. టీడీపీ కార్యకర్తలు పవర్ ఫుల్ అని, మీరు రోడ్డు మీదకు వస్తే ఎవడూ నిలబడలేరన్నారు. కార్యకర్తలకు అప్పుడప్పుడు అలక వస్తుందని, అటువంటి ప్పుడు కాడె పడేస్తారన్నారు. అయితే, ఎక్కడికీ వెళ్లరని, ఏ జెండా పట్టుకోరని, ఎవరికి ఓటు వేయరని పేర్కొన్నారు. కానీ, ఆ అలకే ప్రమాదమన్నారు. అందుకే తాను ఒక నిర్ణయం తీసుకున్నానని, పార్టీ కార్యకర్తకు భవిష్యత్తులో అలక రాకుండా చేయడమే లక్ష్యమన్నారు. అందుకే ఇటీవల రెండు గంటలు ప్రజలు, ప్రభుత్వం కోసం పనిచేస్తే...మరో



బీచ్ రోడ్డులో యోగాడే ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎం

రెండు గంటలు కుటుంబ సభ్యులైన పార్టీ కార్యకర్తల కోసం వెచ్చిస్తున్నానన్నారు. ఈ సమయం కొండనైనా బద్ధలు చేసే టానిక్‌గా పనిచేస్తోందన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా సమావేశాన్ని ఏర్పాటు చేయడం వల్ల పాత జిల్లాలోని అందరినీ చూడగలుగుతున్నట్టు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో మనం ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని, దీన్ని తన మాటగా ప్రజలకు చెప్పాలన్నారు. పార్టీ కోసం సైనికుల మాదిరిగా పనిచేశారని, పార్టీ కూడా కార్యకర్తల గౌరవాన్ని కాపాడేలా చూసుకుంటుందన్నారు. విశాఖ అంటే తనకు ఎంతో ఇష్టమని, ఇక్కడ మంచివాళ్లు ఎక్కువగా ఉంటారన్నారు. ఈ ప్రాంతం ఎప్పుడూ టీడీపీకి కంచుకోటన్నారు. హుద్‌హుద్ తరువాత ఎన్నికలు ఎప్పుడు పెట్టినా టీడీపీ జెండా తప్ప మరొకటి ఎగురలేదన్నారు.

స్టీల్‌ప్లాంటును కాపాడిన ఘనత ఎన్‌డీఏదే..

కష్టాల్లో ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమను అప్పుడు, ఇప్పుడూ కాపాడిందీ ఎన్‌డీఏ భాగస్వామ్య ప్రభుత్వమేనని చంద్రబాబునాయుడు స్పష్టంచేశారు. వాజపేయి హయాంలో ఒకసారి స్టీల్‌ప్లాంటును నష్టాల్లో నుంచి బయటకు తీసుకువచ్చామన్నారు. ఇప్పుడు మరోసారి రూ.11,500 కోట్ల ప్యాకేజీ ఇప్పించడం ద్వారా ప్లాంటును పరిరక్షించామన్నారు. ప్లాంటుపై కేంద్రం సందేహాలు వ్యక్తం చేసినప్పుడు నీళ్లు, విద్యుత్, భద్రత కల్పిస్తామని భరోసా ఇచ్చామన్నారు. తద్వారా కర్మాగారాన్ని కొనసాగించేలా చేసుకోగలిగామన్నారు. త్వరలో స్లర్రీ ద్వారా ముడి ఇనుము తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. దీనివల్ల పరిశ్రమపై భారం తగ్గి లాభాల బాటలో పయనించేందుకు అవకాశం ఉంటుందన్నారు. దీనికి విశాఖపట్నంపై తనకు ... మిగతా 4వ పేజీలో



ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి

జీవీఎంసీ కమిషనర్‌గా కేతన్‌గార్గ్

- రేపు బాధ్యతలు స్వీకరించే అవకాశం



కేతన్‌గార్గ్

విశాఖపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) కమిషనర్‌గా కేతన్‌గార్గ్‌ను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఐదు నెలల తర్వాత జీవీఎంసీకి పూర్తిస్థాయి కమిషనర్‌ను నియమించినట్టయింది. 2018 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన కేతన్‌గార్గ్ శిక్షణ అనంతరం విజయనగరం ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్‌గా దాదాపు ఏడాదిపాటు పనిచేశారు. అనంతరం రాజంపేట సబ్ కలెక్టర్‌గా, అనంతపురం జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. ఆ తర్వాత మూడు నెలలు పాటు అదే జిల్లాలో జిల్లాపరిషత్ సీఈవోగా పనిచేశారు. గత ఏడాది జూలై నుంచి రాజమండ్రి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. ప్రపంచ యోగా దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పరిశీలన నిమిత్తం ప్రస్తుతం నగరంలోనే ఉన్న కేతన్‌గార్గ్ బుధవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

ఉక్కులో వీఆర్ఎస్‌కు సీనియర్ల మొగ్గు

- పని ఒత్తిడి తట్టుకోలేకే వెళ్లిపోవాలని నిర్ణయం
- మలివిడత 600 మందిని తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్న యాజమాన్యం
- అంతకుమించి దరఖాస్తులు అందే అవకాశం



విశాఖపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్ ప్లాంటు మరోసారి స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) పథకం ప్రకటించడంతో సీనియర్ అధికారులు అంతా వెళ్లిపోవాలని భావిస్తున్నారు. యాజమాన్యం ఈ ఏడాది డిసెంబరు చివరికల్లా ఉద్యోగుల సంఖ్యను బాగా తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అధికారులు, నాన్ ఎగ్జిక్యూటివ్‌లు కలిపి 9,500 మంది ఉండాలని, అలాగే కాంట్రాక్టు వర్కర్లు 8,500కు మించకూడదని లెక్కలు వేసుకుంది.

ఈ ఏడాది ప్రారంభంలో వీఆర్ఎస్ ప్రకటించగా సుమారుగా 1,200 మంది ఉద్యోగులు వెళ్లిపోయారు. కాంట్రాక్టు వర్కర్లను దశల వారీగా తగ్గిస్తున్నారు. ఒకేసారి 2,500 మందిని తొలగించడంతో కార్మిక సంఘాలు సమ్మె చేశాయి. దాంతో యాజమాన్యం పంథా మార్చింది. ఒకేసారి వందల సంఖ్యలో తీయకుండా ఏదైనా కాంట్రాక్టు ముగిసిపోతే, అందులో వర్కర్లకు గేట్ పాస్‌లు ఇవ్వకుండా ఆపేస్తోంది. అలా వారానికి వంద మంది వరకూ తగ్గిపోతున్నారు. ఎవరైనా కార్మిక సంఘం పేరుతో ప్రకటనలు చేస్తే వారికి నోటీసులు ఇస్తున్నారు. దాంతో ఎవరూ నోరెత్తడం లేదు. ఈ నెల 26న మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌ను ప్రారంభించనున్నారు. ఆ పేరుతో ఉద్యోగులతో 12 గంటలు పనిచేయిస్తున్నారు. చెప్పిన విధంగా కాంట్రాక్టు వర్కర్లను తగ్గించకపోతే విభాగాధిపతులకు నోటీసులు ఇస్తున్నారు. తక్కువ మందితో పనిచేయడం కష్టంగా ఉండడం, మరోవైపు యాజమాన్యం 100 శాతం ఉత్పత్తి అంటూ పనిభారం మోపడంతో సీనియర్లు వీఆర్ఎస్ తీసుకొని వెళ్లిపోవడమే ఉత్తమమని భావిస్తున్నారు. ప్లాంటులో ఉండి మాటలు పడి, నోటీసులు అందుకునే కంటే వచ్చిన డబ్బులు తీసుకొని ఆరోగ్యం కాపాడుకోవడమే మేలని భావిస్తున్నారు. యాజమాన్యం ఈసారి 600 మందిని వీఆర్ఎస్ ద్వారా తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు సమాచారం. అంతకుమించి దరఖాస్తులు అందుతాయని అంచనా వేస్తున్నారు.

31 రోజుల్లో రూ.3.21 కోట్లు

అప్పన్నకు రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం



హుండీల లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈఓ

సింహాచలం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామికి గడచిన 31 రోజుల్లో హుండీల ద్వారా రికార్డు స్థాయిలో సుమారు రూ.3.21 కోట్లకుపైగా ఆదాయం సమకూరింది. దేవస్థానం కార్యనిర్వహణాధికారి వేండ్ర త్రినాథరావు పర్యవేక్షణలో సోమవారం సింహగిరిపై పరకామణిలో హుండీల లెక్కింపు చేపట్టారు. నగదు రూపంలో రూ.3,21,38,717 లభించినట్టు అధికారులు వెల్లడించారు. హుండీల ద్వారా ఇంత పెద్ద మొత్తం లభించడం దేవాలయ చరిత్రలో ఇదే తొలిసారి. నగదుతో పాటు 203 గ్రాముల బంగారం, 18.25 కిలోల వెండి, 231 యుఎస్ డాలర్లు, 185 ధీరమ్స్, కెనడాకు చెందిన 15 డాలర్లు, సింగపూర్ డాలర్లు 12, సౌదీ, ఒమన్, శ్రీలంక, మలేషియా, టర్కీ తదితర దేశాల కరెన్సీ కూడా అప్పన్న ఖజానాకు సమకూరింది. హుండీల లెక్కింపులో దేవస్థానం వివిధ విభాగాలకు చెందిన ఏఈఓలు, పర్యవేక్షణాధికారులు, పలు స్వచ్ఛంద సంస్థల సేవా కార్యకర్తలు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న టిప్పర్ లారీ 6లో



యోగాంధ్రకు 10,000 మందితో బందోబస్తు

- నేటి నుంచి బీచ్‌రోడ్డులో వాహనాల రాకపోకలపై ఆంక్షలు
- 21వ తేదీ వరకూ పూర్తిగా మూసివేత
- 20వ తేదీ మధ్యాహ్నం నుంచి నగరంలోకి భారీ వాహనాల రాకపై నిషేధం

విశాఖపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): **నగరంలో ఈనెల 21న జరిగే యోగాంధ్ర-2025 వేడుకలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరవుతుండడంతో పది వేల మందితో బందోబస్తు ఏర్పాటుచేస్తున్నారు. డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా నగరంలోనే ఉంటూ స్వయంగా బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. సుమారు 80 మంది ఐపీఎస్ అధికారులకు బందోబస్తు విధుల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. వారితో నిరంతరం సమీక్ష నిర్వహిస్తున్నారు. యోగా డే వేడుకల్లో దాదాపు ఐదు లక్షల మంది పాల్గొంటుండడంతో బీచ్ రోడ్డులో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి.**

యోగాంధ్రకు నగరవాసులే కాకుండా ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల నుంచి కూడా పెద్దఎత్తున హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో బీచ్‌రోడ్డులో ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతుండడంతో మంగళవారం నుంచి ఈనెల 21 వరకు వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధిస్తున్నట్టు సీపీ శంఖబ్రతబాగ్చి తెలిపారు. ఎన్‌టీఆర్ సర్కిల్ నుంచి పార్కు హోటల్ జంక్షన్ వరకూ బీచ్‌రోడ్డును ఈనెల 17 నుంచి 21 వరకూ పూర్తిగా మూసేస్తున్నట్టు ప్రకటించారు. అదేవిధంగా పార్క్ హోటల్ జంక్షన్ నుంచి భీమిలి బీచ్ వరకూ ఎక్కడికక్కడ యోగా స్టేజీల నిర్మాణం జరుగుతుండడంతో ఈనెల 19 నుంచి 21 వరకూ ఆ మార్గంలో అన్నిరకాల వాహనాల రాకపోకలను నిషేధించారు. యోగా వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చే వారంతా 21న ఏ ప్రాంతానికి చేరుకోవాలనే దానిపై నిర్దిష్టమైన మార్గదర్శకాలను విడుదల చేశారు.



బీచ్ రోడ్డులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కాన్వాయ్

- బీచ్‌రోడ్డులో యోగా చేసేందుకు వచ్చే ప్రముఖులు తమ వాహనాలను ఏపీఐఐసీ మైదానంలో పార్కింగ్ చేసి, అక్కడి నుంచి కాలినడకన విశ్వప్రియ ఫంక్షన్ హాల్‌కు చేరుకోవాల్సి ఉంటుంది.
- ఏయూ మైదానంలో యోగా చేసేందుకు వచ్చే వీఐపీలు తమ వాహనాలతో మద్దిలపాలెం ఆర్చ్ నుంచి లోపలకు చేరుకుని, భాస్కర హాస్టల్ వద్ద పార్కింగ్ చేసి కాలినడకన ప్రాంగణానికి చేరుకోవాల్సి ఉంటుంది.
- శ్రీకాకుళం జిల్లా ... మిగతా 4వ పేజీలో

మెట్రో రైలు భూ సేకరణ పనులకు శ్రీకారం

- సామాజిక ప్రభావ అంచనాపై సర్వే
- తొలి దశలో 46.23 కి.మీ. పొడవున మూడు కారిడార్ల నిర్మాణం
- 87 ఎకరాల ప్రభుత్వ భూమితో పాటు 9.22 ఎకరాలు పట్టా భూమి అవసరం



గాజువాక ప్రాంతంలో సర్వే నిర్వహిస్తున్న అధికారుల బృందం

విశాఖపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో మెట్రో రైలు ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణకు అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. తొలి దశలో 46.23 కి.మీ. పొడవున మూడు కారిడార్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ భూమి 87 ఎకరాలు కాకుండా పట్టా భూమి 9.22 ఎకరాలు అవసరమని అధికారులు తేల్చారు. ఇది గాజువాక, గోపాలపట్నం మండలాలతో పాటు విశాఖపట్నం జోన్-3, 4, 5లలో ఉంది. వడ్లపూడి, మింది, చినగంట్యాడ, గాజువాక, అక్కిరెడ్డిపాలెం, తుంగ్లాం, గోపాలపట్నం, బుచ్చిరాజుపాలెం, మర్రిపాలెం, కప్పరాడ, దొండపర్తి, ... మిగతా 4వ పేజీలో

పీఎంపాలెం రోడ్డులో జోరుగా ఆక్రమణలు

- యోగాంధ్ర ఏర్పాట్లలో అధికారులు
- ఇదే అదునుగా రెచ్చిపోతున్న అక్రమార్కులు
- రాత్రికి రాత్రి కంటైనర్ దుకాణాలు ఏర్పాటు
- కబ్జాదారులకు స్థానిక నేత అండ



సాంకేతిక ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని తులసీనగర్ పార్కు వద్ద రాత్రికి రాత్రి వెలసిన దుకాణాలు

విశాఖపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ సమీపంలోని పీఎంపాలెం రోడ్డులో ఆక్రమణలు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే ఇక్కడ ఏ చిన్న ఖాళీ స్థలం కనిపించినా.. అక్రమార్కులు విడిచిపెట్టడం లేదు. ప్రస్తుతం అన్ని శాఖల అధికారులు ఈనెల 21న జరిగే యోగా దినోత్సవం ఏర్పాట్లలో నిమగ్నమై ఉండడంతో ఇదే అదనుగా అక్రమార్కులు మరింతగా రెచ్చిపోతున్నారు. పీఎంపాలెం జాతీయ రహదారి నుంచి తులసీనగర్, సాంకేతిక ఇంజనీరింగ్ కళాశాల మీదుగా బక్కనపాలెం వరకు 60 అడుగుల రోడ్డు మాస్టర్ ప్లాన్‌లో ప్రతిపాదించారు. ప్రస్తుతం 30 అడుగుల రోడ్డు మాత్రమే ఉంది. రోడ్డుకి ఇరువైపులా కొంత ఖాళీ స్థలం ఉండడంతో అక్రమార్కులు అనధికారికంగా దుకాణాలు ఏర్పాటు చేసి అద్దెలకు ఇస్తున్నారు. దుకాణాలకు భారీగా డిమాండ్ ఉండడం, ఒక్కో షాప్‌నకు రూ. 15 వేలు వరకు అద్దె వస్తుండడంతో కొంత మంది చోటా నేతలు దీన్ని వ్యాపారంగా మార్చుకున్నారు. అధికారులంతా ప్రస్తుతం యోగాంధ్ర ఏర్పాట్లలో నిమగ్నమై ఉండడంతో ఇదే అదనుగా తులసీనగర్ పార్కుకి రోడ్డుకి మధ్య ఉధ్య ఉన్న ఖాళీ స్థలంలో రాత్రికి రాత్రి రెండు భారీ కంటైనర్ దుకాణాలు తెచ్చి పెట్టేశారు. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఈ రోడ్డులో కొన్ని అక్రమ దుకాణాలు ఉన్నాయి. కొత్తగా ఏర్పాటు చేసిన దుకాణాలతో ఆ రహదారిపై వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. కాగా విజేత మార్కెట్ - సాంకేతిక కళాశాల డబుల్ రోడ్డులో కొంతమంది ఏకంగా రోడ్డుపైనే భారీ షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించి, కొనుగోలుదారుల కోసం అందమైన టైల్స్ అతికించారు. దీనిపై స్థానికులు జోన్-2 అధికారులకు ఫిర్యాదు చేయగా టౌన్‌ప్లానింగ్ అధికారులు అక్కడికి వెళ్లారు. కానీ అధికార పార్టీ నేత నుంచి ఒత్తిడి రావడంతో వెనుదిరిగారు. తాజాగా తులసీనగర్ పార్కు వద్ద దుకాణాలు ఏర్పాటు చేయడం లోనూ అదే ప్రజాప్రతినిధి అండ ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పార్కు వద్ద దుకాణాలు ఏర్పాటు చేస్తే అక్కడకు ఆకతాయిలు చేరి ఉదయం, సాయంత్రం వేళ వాకింగ్ కోసం పార్కుకు వెళ్లే మహిళలను ఇబ్బందులకు గురి చేసే అవకాశం ఉంది. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



పీఎంపాలెంలోని వి. కన్వెన్షన్ సెంటర్‌లో కార్యకర్తల సమావేశానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ముఖ్యమంత్రి చంద్రబాబు గీతం సందర్శన



గీతంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఎంపీ శ్రీభరత్

సాగర్‌నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం మధ్యాహ్నం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. విశాఖ పర్యటనలో భాగంగా బీచ్ రోడ్డులో యోగాంధ్ర పనుల పరిశీలించిన అనంతరం బీచ్‌రోడ్డు మీదుగా గీతం వర్సిటీకి చేరుకున్నారు.అక్కడ ఎంపీ శ్రీభరత్‌తో కలిసి వాహనంపై నుంచి అందరికీ అభివాదం చేస్తూ.. ముందుకు వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ ఆయనకు వర్సిటీ ప్రో వీసీ గౌతమ్‌రావు, రిజిస్ట్రార్ డి. గుణశేఖర్‌ను పరిచయం చేశారు.

‘తల్లికి వందనం’తో పేదల్లో సంతోషం : కూటమి నేతలు

ఎండాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : తల్లికి వందనం పథకం అమలుతో పేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని 8వ వార్డు కూటమి నాయకులు అన్నారు. సోమవారం వారు ఎండాడలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు, పుస్తకాలు, యూనిఫారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని, జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, కూటమి నాయకులు చెట్టుపల్లి గోపి, శాఖరీ శ్రీనివాస్, చెట్టుపల్లి సన్యాశిరావు, చినగోపి, సారిపిల్లి శ్రీను, పరమేశ్వరావు, ఒమ్మి బాబూరావు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి

భీమునిపట్నం : విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యా వ్యవస్థలో నూతన మార్పులకు శ్రీకారం చుట్టారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. సోమవారం ఆయన 3వ వార్డులోని రెల్లివీధి, కొండపేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు స్కూల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మారోజు సంజీవకుమార్, అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

మద్ది పాఠశాలలో..

పద్మనాభం : మద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు విద్యార్థి కిట్లను పంపిణీ చేశారు.యూనిఫారంతో పాటు బెల్టు, సాక్సులు, బ్యాగు, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు ఇతర సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాంబాబు, నగేష్‌కుమార్, సన్నిబాబు, సన్యాసి నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘తల్లికి వందనం’లో తప్పులను సవరించాలి

తగరపువలస, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : తల్లికి వందనం పథకంలో అనేక లోటుపాట్లు వల్ల చాలామంది అర్హులకు నగదు జమ కాలేదని సీపీఐ నాయకులు ఆరోపించారు. సోమవారం వారు జీఆర్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. అన్ని వివరాలు సక్రమంగా నమోదు చేసినప్పటికీ చాలామందికి నగదు జమ కాలేదన్నారు. తప్పులను సరి చేసి, అర్హులకు పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. ఈమేరకు సచివాలయ సిబ్బందికి ప్రత్యేక ఆదేశాలు జారీ చేయాలని చెప్పారు.

భక్తులకు వసతి కరువు



ఎండలో భక్తుల నిరీక్షణ

సింహాచలం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : సింహగిరి బస్టాండ్ టికెట్ల కౌంటర్ వద్ద భక్తులకు వసతి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. స్వామివారి వార్షిక తిరు కల్యాణోత్సవం, చందన యాత్ర సందర్భంగా బస్టాండ్‌లో తాత్కాలిక రేకుల షెడ్‌ను ఇంజినీరింగ్ అధికారులు ఏర్పాటు చేశారు. ఉత్సవాలు ముగియడంతో షెడ్‌ను తొలగించారు. దీంతో బస్టాండ్ ఆవరణలో భక్తులకు వసతి సౌకర్యం లేక ఎండలోను, వర్షంలోను వేచి ఉండాల్సి వస్తోంది.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం, జూన్ 16 (ఆంధ్ర జ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామికి పలు ఆర్జిత సేవలను సోమవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి కల్యాణ వేదికపై అధిష్ఠింపజేశారు.భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. కల్యాణానికి ముందు గోవిందరాజస్వామిని రజిత గరుడ వాహనంపై ఉంచి గరుడ సేవ జరిపారు.

దివ్యాంగులు, వృద్ధుల ఆసరాకు ప్రణాళిక

మధురవాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి విపత్తుల సమయంలో వృద్ధులు, దివ్యాంగుల సంరక్షణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్టు మధురవాడకు చెందిన ఆర్కిటెక్ట్ పరిశోధకురాలు బలిజేపల్లి కావ్యపూర్ణిమ తెలిపారు.ఇటీవల ఢిల్లీలోని నేషనల్ డిసాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎన్‌డీఎంఏ) ప్రధాన కార్యాలయంలో యూనిసెఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌నకు ఆమె ఏపీ నుంచి ప్రత్యేక సలహాదారుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ‘ఆంధ్రజ్యోతి’తో మాట్లాడుతూ విపత్తుల సమయంలో సాధారణ పౌరులు స్పందించినంత వేగంగా దివ్యాంగులు, వృద్ధులు సత్వరమే రక్షణ పొందలేరని, అటువంటి సమయంలో ఎలాంటి సదుపాయాలు కల్పించాలన్న విషయాలపై యూనిసెఫ్‌కు తాను అనేక పత్రాలు సమర్పించినట్టు వివరించారు.

‘ఏడాదిలోనే పాలనలో విఫలం’

ఎండాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలోనే అన్ని రంగాల్లోనూ విఫలమైందని వైసీపీ భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త చిన్న శ్రీను విమర్శించారు. సోమవారం ఆయన ఎండాడ లా కళాశాల రోడ్డులో ఉన్న పార్టీ కార్యాలయంలో 8వ వార్డు అధ్యక్షుడు పోలిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోతుందన్నారు. అంతకముందు ఆయన ప్రభుత్వ వైఫల్యాలపై వైసీపీ ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు.

సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం

గోపాలపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఈనెల 21న జరగనున్న యోగా దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. సోమవారం మధ్యాహ్నం 12.16 గంటలకు గన్నవరం నుంచి నగరానికి చేరుకున్న ఆయనకు మంత్రులు డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర, వంగలపూడి అనిత, ఎంపీలు ఎం.శ్రీభరత్, సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు పి.గణబాబు, గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణ, పంచకర్ల రమేశ్‌బాబు, విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయకుమార్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మేయర్ పీలా శ్రీనివాసరావు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి, తదితరులు స్వాగతం పలికారు.

మెట్రో రైలు భూసేకరణ పనులకు శ్రీకారం

... 3వ పేజీ తరువాయి

అల్లిపురం, కంచరపాలెం, రేసపువానిపాలెం, మద్దిలపాలెం, వెంకోజీపాలెం, చినగదిలి, ఎండాడ, పోతినమల్లయ్యపాలెం, మధురవాడ, అల్లిపురం ప్రాంతాల్లో భూసేకరణ చేయాల్సి ఉంది. ఆ భూములు తీసుకుంటే నిర్వాసితులయ్యే వారి పరిస్థితి ఏమిటి?, సామాజిక ప్రభావం ఎంత ఉంటుంది?...అనే అంశాలు అంచనా వేయడానికి భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ కమిషనర్, జిల్లా కలెక్టర్ కలిసి రైజెస్ అనే బృందాన్ని ఏర్పాటుచేశారు. వీరు క్షేత్రస్థాయిలో పరిశీలించి నూతన భూసేకరణ చట్టం 2013 ప్రకారం నివేదిక ఇవ్వాలి. ఈ బృందం సోమవారం గాజువాక ప్రాంతంలో సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా బృంద సభ్యుడు ఆర్.దేవరాజు మాట్లాడుతూ భూములు కోల్పోయేవారు ఈ ప్రాజెక్టుకు సహకరించాలని కోరామని, వారి అభిప్రాయాలు, సలహాలు, సూచనలు ఏమైనా ఉంటే ప్రజాభిప్రాయ సేకరణలో తెలపవచ్చునన్నారు. వాటిని కూడా నివేదికలో పొందుపరిచి అధికారులకు సమర్పిస్తామన్నారు. ఈ సర్వేలో మెట్రో రైలు ప్రాజెక్టు డిప్యూటీ తహశీల్దార్ పద్మావతి, సర్వేయర్ శ్రీనుబాబు, ఇంజనీర్ లక్ష్మణ్ పాల్గొన్నారు.



బీచ్‌రోడ్డులో సుందరీకరణ పనులు



ఎండాడ సమీపంలో జరుగుతున్న పనులు

యోగా దినోత్సవానికి చురుగ్గా ఏర్పాట్లు

సాగర్‌నగర్, ఎండాడ జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సాగర్‌నగర్, రుషికొండ ప్రాంతాల్లో ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. బీచ్‌రోడ్డుకు ఆనుకుని ఉన్న ప్రాంతాలను యోగాసనాలకు అనుకూలంగా సిద్ధం చేశారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్‌కు ఇబ్బంది కలగకుండా ప్రైవేట్ సెల్‌ఫోన్ ఆపరేటర్ సిగ్నల్స్ కోసం భారీ జనరేటర్‌ను సాగర్‌నగర్ ముఖ ద్వారం వద్ద ఉన్న పార్కులో ఏర్పాటు చేశారు. యోగాంధ్ర కార్యక్రమానికి ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరుకానుండడంతో బీచ్ రోడ్డును జీవీఎంసీ సుందరంగా ముస్తాబు చేస్తోంది. రోడ్డుకు ఆనుకుని సముద్రం వైపు ఉన్న తుప్పలు, డొంలను జేసీబీలతో ఇప్పటికే తొలగించారు. మట్టి దిబ్బలను చదును చేసి రోడ్డుకు సమాంతరంగా వేశారు. అలాగే డివైడర్ మధ్యలో ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి, విద్యుత్ వెలుగులకు ఇబ్బంది లేకుండా చేశారు. పారిశుధ్య సిబ్బంది బీచ్ రోడ్డు పరిశుభ్రంగా ఉండేలా ఎప్పటికప్పుడు పనులు చేపడుతున్నారు. మొత్తమ్మీద పలు శాఖల హడావిడితో బీచ్ రోడ్డులో పండగ వాతావరణం కనిపిస్తోంది.

భీమునిపట్నం : భీమిలి బీచ్‌ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు.ఈమేరకు జీవీఎంసీ భీమిలి జోన్‌కు రూ.15లక్షలు సాధారణ నిధులు మంజూరు చేసింది. పట్టణంలో రంగులు వెలసి కళావిహీనంగా ఉన్న బుద్ధుడి విగ్రహాలకు, మత్స్యకారుడి విగ్రహానికి, గాంధీ పార్కులో ఉన్న మహాత్ముడి విగ్రహానికి రంగులు అద్దుతున్నారు. అలాగే గాంధీ పార్కులో ఉన్న లవ్ భీమిలి యాంబ్లమ్‌కు కొత్తగా స్టీల్ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. బీచ్‌రోడ్‌లో మంగమారిపేట వద్ద, నగరపాలెం, చేపల తిమ్మాపురం వంతెనవద్ద రహదారికి ఇరువైపులా వంతెనల గోడలకు యోగాసనాల వేస్తున్న బొమ్మలు వేయిస్తున్నారు.



స్టీల్ గ్రిల్స్‌తో ఆకర్షణీయంగా ఉన్న లవ్ భీమిలి యాంబ్లమ్



రంగుల అనంతరం కళకళలాడుతున్న బుద్ధుడి విగ్రహాలు

యోగాంధ్రకు 10,000 మందితో బందోబస్తు


... 3వ పేజీ తరువాయి

నుంచి వచ్చేవారు తమ వాహనాలతో తగరపువలస మీదుగా భీమిలి బీచ్‌కు చేరుకుని కేటాయించిన కంపార్టుమెంట్‌లకు చేరుకోవాల్సి ఉంటుంది.

- విజయనగరం నుంచి వచ్చేవారు బోయిపాలెం వద్ద ఎడమవైపు తిరిగి బీచ్‌రోడ్డుకు చేరుకుని వారికి కేటాయించిన కంపార్ట్‌మెంట్‌లకు చేరుకోవాల్సి ఉంటుంది.
- అనకాపల్లి, పెందుర్తి, వేపగుంట వైపుల నుంచి వచ్చేవారు తమ వాహనాలను అడవివరం, హనుమంతవాక, ఎండాడ, లా కాలేజీ రోడ్డు మీదుగా బీచ్‌రోడ్డులో వారికి కేటాయించిన కంపార్టుమెంట్‌లకు చేరుకోవల్సి ఉంటుంది.
- అల్లూరి జిల్లా నుంచి వచ్చేవారంతా బీఆర్‌టీఎస్ రోడ్డులో వేపగుంట, హనుమంతవాక మీదుగా ఎంవీపీ డబుల్ రోడ్డుకు చేరుకుని విశాఖ కంటి ఆస్పత్రి రోడ్డు ద్వారా లేదంటే విష్ణు హోండా జంక్షన్ మీదుగా మద్దిలపాలెం జంక్షన్‌కు చేరుకుని ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో వాహనాలను పార్కింగ్ చేసి కేటాయించిన ప్రాంగణాలకు వెళ్లాల్సి ఉంటుంది.
- ఆర్కే బీచ్ నుంచి భీమిలి బీచ్ వరకూ యోగాలో పాల్గొనేందుకు వచ్చేవారంతా జాతీయ రహదారి మీదుగా ప్రయాణం చేసి ఎంవీపీ డబుల్ రోడ్డు, వెంకోజీపాలెం, విశాఖ వ్యాలీ స్కూల్, ఎండాడ, లాకాలేజీరోడ్డు, మారికవలస, బోయపాలెం ప్రాంతాల్లో గల మార్గాల ద్వారా బీచ్‌రోడ్డుకు చేరుకుని తమకు కేటాయించిన పార్కింగ్ స్థలాల్లో వాహనాలను నిలిపి, కేటాయించిన కంపార్టుమెంట్లలోకి వెళ్లాల్సి ఉంటుంది.
- యోగాంధ్ర నేపథ్యంలో 20వ తేదీ మధ్యాహ్నం నుంచి తరగపువలస జంక్షన్ నుంచి భీమిలి వైపు వాహనాలను మళ్లిస్తారు.
- ఆనందపురం ఫ్లైఓవర్ నుంచి నగరంలోకి భారీ వాహనాలను అనుమతించబడవు. ఆనందపురం జంక్షన్ నుంచి డైవర్షన్ తీసుకుని పెందుర్తి, అనకాపల్లి మీదుగా జాతీయ రహదారిపైకి వెళ్లాల్సి ఉంటుంది.
- అనకాపల్లి నుంచి వచ్చే భారీ వాహనాలు (నిత్యావసర వస్తువులు మినహా) నగరంలోకి ప్రవేశించడానికి వీల్లేదు.
- పెందుర్తి జంక్షన్ నుంచి నగరంలోకి భారీ వాహనాలు ప్రవేశం నిషిద్ధం
- మద్దిలపాలెం ఇంజనీరింగ్ కాలేజీ ఆర్చ్ నుంచి త్రీటౌన్ స్టేషన్ వైపు వీఐపీ వాహనాలకు అనుమతి ఉంటుంది.
- 21న ఉదయం 11 గంటలకు యోగా చేసేవారి వాహనాలు తప్ప ఇతర వాహనాలు బీచ్ వైపు వెళ్లడానికి అనుమతించరు.

భూములను అమ్మకానికి పెడితే అడ్డుకుంటాం

జూట్‌మిల్లు యాజమాన్యానికి కార్మిక సంఘాల హెచ్చరిక



భూములను పరిశీలిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

తగరపువలస, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్ మిల్లు యాజమాన్యం తన ఆధీనంలో ఉన్న విలువైన భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్మకానికి చేసిన ప్రయత్నాలను కార్మిక సంఘాలు అడ్డుకున్నాయి. భూముల కొనుగోలుకు వచ్చిన వారికి వాస్తవ పరిస్థితులను వివరించారు. సోమవారం అమ్మకాలకు సిద్ధం చేసిన భూములను అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జీరు వెంకటరెడ్డి మాట్లాడుతూ చాలా భూములు జాయింట్ లేబర్ కమిషనర్ ఆధ్వర్యంలో అటాచ్‌మెంట్‌లో ఉన్నాయని, కొన్ని కోర్టు కేసుల్లో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. చౌకగా వస్తున్నాయని కొంత మంది కొనుగోలుకు ముందుకు వస్తున్నారని, ఒకవేళ ఎవరైనా కొనుగోలు చేస్తే ఆ భూముల్లో ప్రవేశించి, అక్కడ నిర్మాణాలు జరగకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. మిల్లు యాజమాన్యం కార్మికులకు కోట్లాది రూపాయల బకాయిలు ఉందని, వాటిని చెల్లించే వరకూ అమ్మకాలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు చిల్ల వెంకటరమణారెడ్డి, దల్లి అప్పలరెడ్డి, మనకాల ఆదినారాయణ, కొండపు ఈశ్వరరావు, చిల్ల రాంపూడయ్య, మద్దిల దేముళ్లు, నరవ రామారావు, తదితరులు పాల్గొన్నారు.



కొద్దిపాటి వర్షానికే బురదమయమైన రోడ్డు

భైరవస్వామి దర్శనానికి భక్తుల పాట్లు



గేటు మూసి వేసి ఏర్పాటు చేసిన బోర్డు

సింహాచలం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానం ఉపాలయం, అడివివరం గ్రామానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతంలో ఉన్న భైరవస్వామి దర్శనానికి భక్తులు పడరాని పాట్లు పడుతున్నారు. ఈ ఆలయానికి ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వస్తుంటారు. భైరవవాకకు వెళ్లాలంటే సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో భక్తులు ఆటోలను ఆశ్రయించి అధికంగా వెచ్చించాల్సి వస్తోంది. కొన్ని నెలలు క్రితం వరకు ఆటోల్లో ఆలయం వరకు సులభంగా వెళ్లేవారు. అయితే ఆలయ ఆవరణ అటవీ ప్రాంతంలో ఉండడంతో అభయారణ్యంగా ప్రకటించిన ఆ ప్రాంతంలో మూగజీవాలకు హాని కలుగుతుందని, లేదా భక్తులకు మూగజీవాల వల్ల ఇబ్బంది కలుగుతుందన్న అభిప్రాయంతో అటవీ శాఖాధికారులు ఆలయ మార్గానికి చేరుకునే దారి ప్రారంభంలో గేటు ఏర్పాటు చేసి, తాళం వేశారు. అప్పటి నుంచి ఆటోల్లో వెళ్లాల్సిన భక్తులు కాలినడకన వెళ్లవలసి వస్తోంది. ఒక దశలో నడవలేని స్థితిలో ఉన్న మహిళను కుటుంబ సభ్యులు డోలీ కట్టి మోసుకుని వెళ్లి స్వామి దర్శనం కల్పించారు. కాగా ఈ మార్గంలో చిన్న వర్షం పడినా రోడ్డు బురదమయంగా మారి నడిచేందుకు కూడా వీల్లేని పరిస్థితి ఉంది. అలాగే ప్రధాన గేటుకు సమీపంలో ఉన్న బోరు నిరుపయోగంగా ఉంది. ఇప్పటికైనా పాలకులు,అధికారులు స్పందించి గేటుకు తాళం తీయించడంతో పాటు రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

ముంబైకు దీటుగా విశాఖ అభివృద్ధి

... 3వ పేజీ తరువాయి

పరుగులు పెట్టిస్తున్నామన్నారు. విశాఖ బ్రాండ్‌ను పెంచగలిగితే ఆకాశమే హద్దుగా అభివృద్ధి చెందుతుందన్నారు. విశాఖలో సివిల్ ఏవియేషన్ యూనివర్సిటీ కూడా ఏర్పాటు చేయబోతున్నట్టు ముఖ్యమంత్రి వెల్లడించారు. దీనివల్ల విమానాల్లో ఉద్యోగాలు చేసే స్థాయికి మన పిల్లలు చేరుకుంటారన్నారు. రాష్ట్రమంతా ఒక ఎత్తైతే...విశాఖ మరో ఎత్తన్నారు. భవిష్యత్తులో విశాఖకు మెట్రో రైలు వస్తుందని పేర్కొన్నారు. గతంలో తాను మెట్రోకు సంబంధించిన ప్రతిపాదనలను పెడితే...ఐదేళ్ల ఎక్కడి వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా పరిస్థితి ఉందన్నారు. విశాఖకు ఇప్పటికే టీసీఎస్ వచ్చిందని, త్వరలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటవుతుందన్నారు. ప్రపంచంలోని డేటాను విశాఖకు తెచ్చి ఏఐ సాయంతో విశ్లేషించనున్నట్టు తెలిపారు. ఇందుకు సింగపూర్ నుంచి విశాఖకు సముద్ర మార్గంలో కేబుల్ వేయనున్నట్టు చంద్రబాబునాయుడు వెల్లడించారు. అనకాపల్లి జిల్లాలో ఆర్సెల్ మిట్టల్ స్టీల్‌ప్లాంటు వస్తోందని, అది ఏర్పాటైతే అక్కడ స్టీల్ సిటీ ఏర్పాటవుతుందన్నారు.

ప్రభుత్వ భూముల తాకట్టు..

గత వైసీపీ పాలకులు విశాఖలోని ప్రభుత్వ ఆస్పత్రులు, కాలేజీలు, కలెక్టరేట్, తహశీల్దార్ కార్యాలయాలను తాకట్టు పెట్టేశారని చంద్రబాబు ఆరోపించారు. ఫైనాన్స్ కమిషన్ నుంచి రెండేళ్లకు రావాల్సిన డబ్బులను ముందుగానే డ్రా చేశారన్నారు. విశాఖలో భారీఎత్తున భూకబ్జాలకు పాల్పడ్డారని,వైసీపీ పాలకులకు ఇష్టం లేని భూములను 22ఏలో పెట్టి ఇబ్బందులకు గురిచేశారన్నారు. అయితే, తాము అధికారంలోకి వచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేశామని, భూములు జోలికి వెళ్లాలంటే వెన్నులో వణుకు పుట్టేలా చర్యలు చేపట్టామన్నారు. భూమి రికార్డుల్లో మార్పులు చేయకుండా బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో వాటిని పరిరక్షించే ప్రయత్నం చేస్తున్నామన్నారు.

విశాఖ కేంద్రంగా ఎకనామిక్ హబ్..

విశాఖ కేంద్రంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం ఎకనామిక్ హబ్ అభివృద్ధి చేస్తామని సీఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు రిపోర్ట్ తయారైందన్నారు. కాకినాడ పోర్టు నుంచి మూలపేట పోర్టు వరకూ గల ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే బెస్ట్ ఎకమినామిక్ కారిడార్‌గా నిలుస్తుందన్నారు.

యోగాలో భాగస్వాములు కావాలి..

ఈ నెల 21న నిర్వహించనున్న యోగాంధ్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. యోగాంధ్రతో విశాఖను ప్రపంచపటంలో పెట్టే బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికీ మ్యాట్, టీ షర్ట్ ఇస్తామన్నారు. ప్రతిరోజూ ఇంటి వద్ద యోగా చేస్తే ఆరోగ్యంగా ఉండవచ్చునన్నారు. 45 నిమిషాలపాటు ఎంతమంది యోగా చేస్తారో చేతులు ఎత్తాలని చంద్రబాబు చెప్పగా.. అందరూ చేతులెత్తేశారు. దీనికి ఆయన నవ్వుతూ..తనపై ఒట్టేసి చెప్పాలని కోరడంతో అందరూ నవ్వుకున్నారు.

గుంత కనిపిస్తే మేయర్ పదవి గోవిందా.?

నగర పరిధిలో రోడ్లు బాగుండాలని, ఎక్కడా గుంత కనిపించకూడదని చంద్రబాబునాయుడు అన్నారు. గుంత కనిపిస్తే మేయర్ పదవి గోవిందా అంటూ పీలా శ్రీనివాస్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించినప్పుడు అంతా నవ్వారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు లేచి ఎయిర్‌పోర్టులో మీపై దాడి జరిగిన వ్యవహారంపై దృష్టిసారించాలని కోరగా..తన దృష్టిలో ఉందని చంద్రబాబునాయుడు సమాధానమిచ్చారు. రాష్ట్రంలో గత ప్రభుత్వంలో అరాచకాలకు పాల్పడిన కొడాలి నాని, పేర్ని నానిలను అరెస్టు చేయాలని కొందరు, జగన్‌ను అరెస్ట్ చేయాలని మరికొందరు నినాదాలు చేశారు.

స్టీల్‌ప్లాంటును కాపాడిన ఘనత ఎన్‌డీఏదే..

... 3వ పేజీ తరువాయి

ఉన్న అభిమానమే కారణమన్నారు. ఉద్యోగులు ప్లాంటును శాశ్వతంగా రక్షించుకునేందుకు లాభాల బాటలో పయనించేలా చేయాలన్నారు. స్టీల్‌ప్లాంటు 20 వేల ఎకరాల్లో ఉందని, ఎకరా ఆరు కోట్లు చొప్పున చూసినా లక్ష కోట్లకుపైగా ఆస్తి ఉందన్నారు. దీన్ని కాపాడుకుని రాష్ట్రాభివృద్ధికి వినియోగించుకోవాలన్నారు. గత ప్రభుత్వం విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటుకు భూమి అడిగితే ఇవ్వలేదని చంద్రబాబునాయుడు ఆరోపించారు. అయితే, అభివృద్ధి విషయంలో తాము ఎక్కడా రాజీ పడకుండా భూమిని కేటాయించామన్నారు. ఎన్‌టీపీసీ అనకాపల్లి జిల్లాలో లక్షా 85 వేల కోట్లు రూపాయలతో గ్రీన్ హైడ్రోజన్ పవర్ ఉత్పత్తిచేసే ప్లాంటు ఏర్పాటుకు చర్యలు శ్రీకారం చుట్టిందని, నక్కపల్లిలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు మూడు, నాలుగు ఫార్మాస్యూటికల్ కంపెనీలు ముందుకు వచ్చాయన్నారు. వాటి వల్ల పెద్దఎత్తున స్థానిక యువతకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

యోగా దినోత్సవం సందర్భంగా నగరంలో జరుగుతున్న ఏర్పాటన్లు పరిశీలించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం విశాఖ వచ్చారు. ఆయనకు విమానాశ్రయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు ఘన స్వాగతం పలికారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి





ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న మంత్రులు బాల వీరాంజనేయస్వామి, గుమ్మిడి సంధ్యారాణి, కందుల దుర్గేష్, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్, ఎంపీలు శ్రీభరత్, సీఎం రమేష్, మేయర్ పి.శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్, వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్ రాజు, సుందరపు విజయకుమార్, బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, తదితరులు.



చెంగు చెంగున తిరుగుతున్న జింక

జూలో జింకల సందడి

ఆరిలోవ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలలో చుక్కల జింకలు సందడి చేశాయి. జింకలు నెమళ్ల మోటుల వద్ద గడ్డి మేయడానికి వచ్చాయి. అవి చెంగు చెంగున ఎగరడం చూపరులను ఆకట్టుకున్నాయి. సందర్శకులు వాటికి ఫొటోలు తీసి ఆనందించారు.

ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్తగా సింహాచలం



బాధ్యతలు స్వీకరిస్తున్న సింహాచలం

వెంకోజీపాలెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్తగా చిత్రకళ విభాగాధిపతి డి. సింహాచలం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు పలువురు ఆచార్యులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆచార్య హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

వీధి విక్రయదారులకు గుర్తింపు కార్డుల జారీకి దరఖాస్తులు

వెంకోజీపాలెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : వీధి విక్రయదారులకు గుర్తింపు కార్డుల జారీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జోన్-4 కమిషనర్ మల్లయ్యనాయుడు తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వీధి విక్రయదారుల చట్టం 2014 జీవో నెంబరు 137 ప్రకారం జీవీఎంసీ పరిధిలో ఉన్న తోపుడు బండ్లు, ఇతర వీధి విక్రయదారులకు గుర్తింపు కార్డులు అవసరమని చెప్పారు. అర్హులైన వారు ఈనెల 18వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

సినిమా గైడ్

- **డ్రాగన్ 3డి** : జగదాంబ
- **బల్లెరినా** : రమాదేవి
- **గేంబ్లర్స్** : శారద
- **థగ్ లైఫ్** : మెలోడి, సంగం, కామేశ్వరి, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **భైరవం**: శ్రీకన్య, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక)
- **సింగిల్** : గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 22, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 18, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 34, బీరకాయలు 30, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 20, క్యారెట్ 40 దొండకాయలు 20, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 54, అల్లం (పాతది) 52, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 70, బద్దచిక్కుడు 50, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 90, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 74, కీరదోస 30, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడ దుంపలు 30, కంద 56, దేముడు చిక్కుడు 56, గోరు చిక్కుడు 38, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర 4, తోటకూర 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	77
లైవ్ ధర	97
విత్ స్కిన్	164
స్కిన్‌లెస్	174

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సొంతం

» డిప్యూటీ కలెక్టర్ సత్య పద్మ

మద్దిలపాలెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : యోగా చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటామని డిప్యూటీ కలెక్టర్ సత్యపద్మ తెలిపారు. మద్దిలపాలెంలోని డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సోమవారం నిర్వహించిన యోగాంధ్ర ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ యోగా సాధన చేయాలన్నారు. యోగా ఆవశ్యకత తెలియజేసేలా ఈనెల 21న నగరంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొవాలని పిలుపునిచ్చారు. అనంతరం మద్దిలపాలెం ఏరియాలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు యోగాంధ్రలో పాల్గొనాలని అవగాహన కల్పించారు. ముందుగా కళాశాలలో విద్యార్థులతో యోగా ఆసనాలు వేయించారు. యోగాలో ప్రతిభ కనబరిచిన వారికి సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వేదవ్యాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కృష్ణ కళాశాల విద్యార్థులు



సమావేశంలో పాల్గొన్న డ్వాక్రా మహిళలు

యోగాంధ్ర విజయవంతం చేయాలి

మద్దిలపాలెం : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 21న నగరంలో నిర్వహిస్తున్న యోగాంధ్ర దినోత్సవాన్ని విజయవంతం చేయాలని టీడీపీ పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ పిలుపునిచ్చారు. జీవీఎంసీ 22వ వార్డు పితాపురంకాలనీలో సోమవారం 120 డ్వాక్రా గ్రూపుల మహిళలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యోగాంధ్రలో ప్రతి ఒక్క మహిళ పాల్గొనాలని కోరారు. ఈ వార్డు నుంచి 2వేల మంగి పైగా మహిళలు యోగాంధ్రకు హాజరుకావాలని కోరారు. పాల్గొనేవారికి యోగా మ్యాట్, టీషర్ట్ పంపిణీ చేస్తామని, అలాగే యోగా కంపార్టుమెంటులకు చేరుకోవడానికి రవాణ సదుపాయం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కంపార్ట్‌మెంట్‌లలో వాటర్, స్నాక్స్ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని హాజరై నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాలను బాధితులకు అందిస్తున్న ప్రతాప్‌రుద్ర

ఎంవీపీ కాలనీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న ఏయూ అవుట్ గేట్ ప్రాంతానికి చెందిన మహ్మద్ అఫ్రోజుద్దీన్‌కు రూ.3.30 లక్షలు, చినవాల్తేరు తమిళ స్ట్రీట్‌కు చెందిన పసుమర్తి గణేశ్‌బాబుకు రూ.2.74 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. ఈమేరకు సోమవారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ క్యాంప్ కార్యాలయంలో వెలగపూడి ప్రతాప్‌రుద్ర బాధితులకు మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మంగవేణి, లావణ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడంలో ఆనందం

పెదవాల్తేరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : పేదలకు సేవ చేయడంలో ఆనందం ఉంటుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె వెంకట పట్టాభిరామ్ పేర్కొన్నారు. సోమవారం తన పుట్టిన రోజు సందర్భంగా పెదవాల్తేరు హిడెన్ స్ప్రౌట్స్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో కేక్ కట్ చేసి, విద్యార్థులకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను ఎప్పుడూ పేద, బడుగు బలహీన వర్గాల మేలు కోసం పని చేస్తానని తెలిపారు. విద్యార్థుల మధ్య జన్మదినోత్సవ వేడుకలు జరుపుకోవడం అనందంగా ఉందని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు పాఠశాల నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న పట్టాభిరామ్

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

అంగన్‌వాడీల నిరసన

సిరిపురం/ వెంకోజీపాలెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు కె. వెంకటలక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం దగ్గర సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ యూనియన్ తమకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధికార సర్వేలో చూపిస్తున్న ప్రభుత్వ ఉద్యోగి అన్న పదాన్ని తీసేయాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్‌లో చూపిస్తున్నట్టు తాము ప్రభుత్వ ఉద్యోగులం కాదని, కేవలం గౌరవ వేతనం ఇస్తున్నారని తెలిపారు. తమ సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షురాలు పి. మణి, బృందావతి, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇసుకతోట అంబేడ్కర్ కాలనీ అంగన్‌వాడీ-2వ కేంద్రంలో అంగన్‌వాడీ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి. శ్యామలాదేవి మాట్లాడారు. ప్రతి నెల 5వ తేదీకి గౌరవ వేతనాలు, బిల్లులు తమ ఖాతాల్లో జమ చేయాలని, పిల్లలకు వండి వడ్డించే మెనూ రేట్లు వెంటనే పెంచాలని, అంగన్వాడీ కేంద్రాలకు సరకులన్నీ ప్రభుత్వమే చేర్చాలని, ట్రాన్స్‌పోర్టు చార్జీలు ఇవ్వాలని, యాప్స్‌ను సవరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రమాదేవి, పి.కృపారాణి, రమ, రాజు తదితరులు పాల్గొన్నారు.



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

సీఐటీయూ నిరసన

తగరపువలస, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని, తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లో తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ నాయకులు తగరపువలస జాతీయ రహదారిపై సోమవారం నిరసన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ జేఏసీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తొలగించిన నాలుగు వేల మంది కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, ఉక్కు ఉద్యమంపై పోలీసుల నిర్బంధాన్ని ఆపు చేయాలని, కార్మిక నాయకులపై పెట్టిన అక్రమ కేసుల్ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జోన్ కార్యదర్శి మూర్తి, ఉపాధ్యక్షుడు అప్పలనాయుడు, రామోదర, బాబాజీ, జోగ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించిన మంత్రులు


సిరిపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగా దినోత్సవం ఏర్పాట్లలో భాగంగా ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను మంత్రులు పి.నారాయణ, కొలుసు పార్థసారధి, ఎం.రాంప్రసాద్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వారు వివిధ జిల్లాల కలెక్టర్లు, అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. జిల్లాలకు కేటాయించిన లక్ష్యం మేరకు ప్రజల తరలింపు, రవాణా, వారికి కల్పిస్తున్న సదుపాయాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి జిల్లాకు కేటాయించిన గ్యాలరీకి ప్రజలను సకాలంలో తరలించాలని, పార్కింగ్ అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఎక్కడా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పని చేయాలని చెప్పారు. తాగునీరు, అల్పాహారం అందేలా చూడాన్నారు. అనంతరం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో వివిధ విభాగాలకు సంబంధించిన టీంలు ఏర్పాటు, కేటాయించిన విధులు గురించి తెలుసుకున్నారు.

ఉక్కు ప్రైవేటీకరణను నిలిపివేయాలి

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ ఆదినారాయణ

కూర్మన్నపాలెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు నగరానికి విచ్చేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో స్టీల్ ప్లాంట్ విక్రయాన్ని నిలుపుదల చేస్తున్నట్టు ప్రకటించేలా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు కృషి చేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి. ఆదినారాయణ కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1,586వ రోజుకు చేరాయి. ఇక్కడి దీక్షా శిబిరం కూలిపోవడంతో మండుటెండలో గొడుగులు వేసుకుని నాయకులు, కార్మికులు తమ దీక్షలను కొనసాగించారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ కార్మికులు అధికంగా ఉన్నారంటూ స్టీల్ ప్లాంట్ కోసం భూములిచ్చిన నిర్వాసితులకు, కాంట్రాక్టు కార్మికులను అక్రమంగా సుమారు 3,500 మందిని తొలగించడం దారుణమన్నారు. కాగా గత వారం రోజుల్లో నాలుగు వందలకు పైగా కాంట్రాక్టు కార్మికులను ఉక్కు యాజమాన్యం కొత్తగా విధుల్లోకి తీసుకున్నా స్థానిక ప్రజాప్రతినిధులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. తక్షణమే నూతన కార్మికుల నియామకాలను ఆపి, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీఐటీయూ జిల్లా నాయకుడు ఎన్.రామారావు మాట్లాడుతూ వర్షం కారణంగా దీక్షల వేదిక కూలి పోయిందని, మళ్లీ నిర్మించుకుంటామంటే ఉక్కు యాజమాన్యం ఫిర్యాదు మేరకు ప్రభుత్వ అధికారులు, పోలీసులు వీల్లేదని చెబుతున్నారన్నారు. అందువల్లే మండుటెండలో గొడుగులు వేసుకుని దీక్షలను కొనసాగిస్తున్నామన్నారు. ప్లాంట్ విక్రయ నిర్ణయాన్ని కేంద్రం ఉపసంహరించేంత వరకు దీక్షలను కొనసాగిస్తామ న్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కృషి చేయాలని కోరారు. నాయకులు సత్యనారాయణ, రామస్వామి, భానుమూర్తి, వెంకటరావు, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.



కూర్మన్నపాలెంలో మాట్లాడుతున్న డి.ఆదినారాయణ

జనసేనలో చేరిన వైసీపీ నాయకులు



పార్టీలో చేరిన వైసీపీ నాయకులతో ఎమ్మెల్యే వంశీ కృష్ణ

మద్దిలపాలెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 35వ వార్డుకు చెందిన వైసీపీ నాయకులు దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. శివాజీపాలెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం కాండ్రేగుల రూప, రామభూక్త సంతోషిని, కాండేగుల లక్ష్మీ, ఆకుల జయ, శివ తదితరులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి లభించిందన్నారు. కష్టపడి పనిచేసిన వారికి వైసీపీలో గుర్తింపు ఉండదని, వలస నేతల చుట్టూ తిరుగుతూ వారికే పదవులిస్తారని మండిపడ్డారు. కూటమిలో పనిచేసేవారికి మంచి భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఏయూ పరీక్షల విభాగం డీన్‌గా మునిస్వామి

వెంకోజీపాలెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఏయూ పరీక్షల విభాగంలో పీజీ, ప్రొఫెషనల్ కోర్సుల డీన్‌గా ఆచార్య బి. మునిస్వామి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్ నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్న అనంతరం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు వర్సిటీ ఆచార్యులు శుభాకాంక్షలు తెలిపారు.



మునిస్వామికి బాధ్యతలు అప్పగిస్తున్న వీసీ

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహణ పనుల దృష్ట్యా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్ త్రీ ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయం ప్రాంతం, పెదగదిలి, చినగదిలి, సంతపాలెం, గాంధీనగర్, ఆరిలోవ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.


విశాఖ డెయిరీలో ప్రమాదం

» కాంట్రాక్టు కార్మికురాలికి తీవ్ర గాయాలు

అక్కిరెడ్డిపాలెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీలో సోమవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఓ కాంట్రాక్టు కార్మికురాలికి గాయాలయ్యాయి. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్మాగారంలోని స్టెరిలైజ్డ్ ఫ్లేవర్డ్ మిల్క్ (ఎస్ఎఫ్ఎం) విభాగంలో సోమవారం సాయంత్రం కొన్ని బాటిళ్లలో ఉష్ణోగ్రత అధికం కావడంతో ఒక్కసారిగా పేలిపోయాయి. ఆ సమయంలో సమీపంలో విధులు నిర్వహిస్తున్న లగుడు రాము (45)పై గాజుపెంకులతో పాటు వేడి పాలు పడ్డాయి. గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి సిబ్బంది తరలించారు. అనకాపల్లి జిల్లా మాకవరపాలేనికి చెందిన ఆమె ఇటీవలే విధుల్లో చేరినట్టు సిబ్బంది తెలిపారు.

ప్రమాదకరంగా ఫుట్‌పాత్‌పై పలక

ఆరిలోవ, జూన్ 16(ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డు కేంద్ర కారాగారానికి సమీపంలో ఉన్న శ్రీకృష్ణపురం అంబేడ్కర్ గురుకులానికి వెళ్లే ఫుట్‌పాత్‌పై పలక విరిగిపోయింది. వారం రోజుల క్రితం జీవీఎంసీకి చెందిన మెషిన్ ఫుట్‌పాత్‌పై నుంచి వెళ్లింది. దీంతో అది విరిగిపోయిందని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయాన్ని గమనించని విద్యార్థులు, వృద్ధులు కాలువలో పడి గాయాలపాలవుతున్నారు.



సీఎంకు ఘన స్వాగతం

గోపాలపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. సోమవారం మధ్యాహ్నం 12.16 గంటలకు గన్నవరం నుంచి నగరానికి చేరుకున్న ఆయనకు మంత్రులు డోలా, కె. పార్థసారథి, కొల్లు రవీంద్ర, అనిత, ఎంపీలు శ్రీభరత్, సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు గణబాబు, గంటా, వెలగపూడి, పంచకర్ల, విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయకుమార్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మేయర్ పీలా శ్రీనివాసరావు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి, తదితరులు స్వాగతం పలికారు.

22న ఎమ్మెల్యే కప్ టేబుల్ టెన్నిస్ టోర్నీ



ప్రచార పోస్టర్ ఆవిష్కరిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు తదితరులు

విశాఖపట్నం స్పోర్ట్సు జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కప్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీని ఈ నెల 22న గోపాలపట్నంలోని ఇండోర్ స్పోర్ట్సు హాల్లో నిర్వహిస్తారు. ఈ టోర్నీ ప్రచార పోస్టర్‌ను పశ్చిమ శాసనసభ్యుడు గణబాబు సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించి నిర్వాహకులను అభినందించారు. ఈ టోర్నీ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం ప్రతినిధులు నాయక్, మురళి పాత్రో, మాజీ ఒలింపియన్ ఎంవీ మాణిక్యాలు పాల్గొన్నారు.

న్యూరో సర్జరీ విభాగానికి శస్త్రచికిత్స పరికరాల వితరణ



కేజీహెచ్ సూపరింటెండెంట్‌కు శస్త్రచికిత్స పరికరాలు అందజేస్తున్న ఆదిలక్ష్మి

మహారాణిపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్ న్యూరో సర్జరీ విభాగానికి సుంకర ఆదిలక్ష్మి తన తండ్రి సుంకర బాల పరమేశ్వరరావు జ్ఞాపకార్థం సోమవారం రూ.8 లక్షల విలువచేసే శస్త్రచికిత్స పరికరాలను వితరణగా ఇచ్చారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణికి ఈ పరికరాలను అప్పగించారు. ఈ సందర్భంగా డాక్టర్ వాణి మాట్లాడుతూ పరికరాలు న్యూరో సర్జరీ విభాగానికి ఎంతో ఉపయుక్తమని, రోగులకు మరిన్ని సేవలు అందించటానికి ఉపయోగపడతాయన్నారు.

సచివాలయాలు కిటకిట



తల్లికి వందనం దరఖాస్తుదారులతో రద్దీ

జ్ఞానాపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకంలో డబ్బులు పడని వారికి ప్రభుత్వం సోమవారం నుంచి విజ్ఞప్తి చేసుకునేందుకు అవకాశం కల్పించడంతో ఇబ్బందులు ఉన్న తల్లులు సచివాలయాల్లో నమోదుకు బారులు తీరారు. కానీ సర్వర్ పనిచేయకపోవడంతో మధ్యాహ్నం వరకు నిరీక్షించినవారు నిరాశతో వెనుదిరిగారు. కొంతమందికి ఇంట్లో ఇద్దరు ఉంటే ఒకరే అర్హులుగా డబ్బు పడడంతో వారు ఆందోళన చెందారు. అలానే తల్లికి వందనం పథకంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్న అర్హులైన విద్యార్థులకు డబ్బు అందకపోవడంతో వారు పెద్ద సంఖ్యలో సచివాలయాలకు చేరుకున్నారు.

జూలై 31న బీచ్‌రోడ్డులో క్రైస్తవుల పాదయాత్ర



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మత పెద్దలు

సీతంపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పరిపాలనలో క్రైస్తవులకు ప్రాధాన్యత ఇవ్వాలన్న కోరికతో జూలై 31న విశాఖ బీచ్ రోడ్డులో పాదయాత్ర నిర్వహిస్తామని ఆలిండియా ఐక్య క్రైస్తవ జాయింట్ యాక్షన్ కోర్ కమిటీ ఛైర్మన్ టి.బాబూరావు తెలిపారు. ద్వారకానగర్‌లోని ఎస్తేరు రాణి ఫౌండేషన్ ట్రస్ట్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలు సహా దేశంలో క్రైస్తవులకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ కేటాయించాలని కోరారు. దేశంలో గణనీయ సంఖ్యలో క్రైస్తవులు ఉన్నారని, వారికి సేవలందించే విద్య, వైద్యశాలలు, ప్రార్థన మందిరాలను కాపాడుకుంటామని స్పష్టం చేశారు. వైఎంసీ నుంచి వేలాది మంది క్రైస్తవులతో వేకువన 3 నుంచి 5 గంటల వరకు పాదయాత్ర చేపడతామని, అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బిషప్‌లు ఎ.బాలరాజు. ఎల్.శ్యామ్యూల్, బాబ్జి, కె.సాంబ శామ్యూల్, రమేష్, ఎస్తేరు రాణి ఫౌండేషన్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ ఎస్తేరు రాణి, సభ్యులు పాల్గొన్నారు.

'కంచరపాలెం పాఠశాల విలీనం తగదు'



మెట్టు వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

కంచరపాలెం/ఆర్పీపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కంచరపాలెం ప్రాథమిక పాఠశాలను సమీపంలో గల ఆర్పీపేట ప్రాథమిక పాఠశాలలో విలీనం చేయవద్దని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. పాఠశాలల పునర్వ్యవస్థీకరణ చట్టంలో భాగంగా గత నెలలో కంచరపాలెం ప్రాథమిక పాఠశాలను బేసిక్ పాఠశాలగా మార్చి, ఇక్కడ చదువుతున్న 3, 4, 5 తరగతుల విద్యార్థులను ఆర్పీపేట ప్రాథమిక పాఠశాలలో విలీనం చేసి దానిని మోడల్ ప్రైమరీ పాఠశాలగా అధికారులు మార్చారు. అయితే కంచరపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య బాగానే ఉందని, ఉపాధ్యాయులు, మౌలిక వసతులు కూడా అందుబాటులో ఉన్నప్పటికీ మరో పాఠశాలలో విలీనం చేయడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం వారు ఆందోళన చేయడంతో జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమకుమార్ పాఠశాలను సందర్శించి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పాఠశాలను ఆనుకుని ఉన్నత పాఠశాల ఉండడంతో కంచరపాలెం ప్రాథమిక పాఠశాలను ఆర్పీపేటలో విలీనం చేశామన్నారు. దీనిపై తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని, వారంలో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను తీసుకుంటామన్నారు. తల్లిదండ్రుల నిరసనకు సీపీఎం, సిటు నాయకులు మద్దతు తెలిపారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కంచరపాలెం పోలీసులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో ఎ.సోమేశ్వరరావు, ఎంఈవో డి.దివాకర్ పాల్గొన్నారు.

వైద్య విద్యార్థుల మృతికి సంతాపం



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఆంధ్ర వైద్య కళాశాల విద్యార్థులు

మహారాణిపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విమాన ప్రమాదంలో వైద్య విద్యార్థుల మృతికి సంతాపం వ్యక్తంచేస్తూ ఆంధ్ర వైద్య కళాశాల విద్యార్థులు సోమవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 12న గుజరాత్‌లోని అహ్మదాబాద్ ఎయిర్ పోర్టు వద్ద జరిగిన ఘోర విమాన ప్రమాదంలో వైద్య విద్యార్థులు మృతి చెందిన విషయం తెలిసిందే. వారి మృతికి సంతాపంగా ఏఎంసీ విద్యార్థులు ఈ కార్యక్రమం నిర్వహించాయి. శ్రద్ధాంజలి ఘటించి, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, జుడా అధ్యక్షుడు డాక్టర్ షిరాజ్‌షా సహా వైద్య విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి



పుస్తకాలు అందిస్తున్న నాయకులు

అక్కయ్యపాలెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి అన్నారు. రైల్వేన్యూకాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను సోమవారం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించి మంచి ప్రయోజకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. టీడీపీ విశాఖ పార్లమెంటరీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అకిరెడ్డి జగదీష్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే ఆశయంతో ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. బాధ్యతలు స్వీకరించిన జీవీఎంసీ, కేఎస్ఎం ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు ఎస్వీ శేషకుమారి, శాంతికుమారిలను సత్కరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు పుష్కలం



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

డాబాగార్డెన్స్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలు పుష్కలంగా ఉంటాయని వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని దక్షిణ ఎమ్మెల్యే సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. సోమవారం డాబాగార్డెన్స్‌లోని రమాదేవి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా ఉపకరణాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తల్లికి వందనం ద్వారా పాఠశాలకు రూ.80 లక్షల వరకు జమ అయ్యిందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాఠశాలలో మొక్కలు పెంచాలని సూచించారు. బాగా చదువుకుని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు హితవు పలికారు. ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



41వవార్డులో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అల్లిపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కాన్వెంటు కూడలి వద్ద గల కాయగూరల టోకు మార్కెట్‌లో రూ.40.75 లక్షలతో సీసీ రోడ్లు, కాలువలు, ఇతర మౌలిక వసతులు, జ్ఞానాపురం శ్మశానవాటిక వద్ద రూ.48 లక్షల అంచనా వ్యయంతో మౌలిక సదుపాయాల కల్పన, పలు అభివృద్ధి పనులకు దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సోమవారం శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా కాయగూరల మార్కెట్‌లోని వర్తకుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పెరిగిన జనాభా అవసరాలకు అనుగుణంగా ఈ మార్కెట్‌ను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. మార్కెట్ ఆధునికీకరణ లేదా మరోచోట విశాలమైన ప్రాంతాన్ని కేటాయించి అభివృద్ధి చేస్తామన్నారు. జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, టీడీపీ, జనసేన, బీజేపీ 41వ వార్డు అధ్యక్షులు ఐతి మధుబాబు, అంతోని శేఖర్, సంజీవరావు, ఐతి రవిబాబు, బానోజీరావు, గవర రమణ, రాజ్‌కుమార్, ఏఈ సతీష్ పాల్గొన్నారు.

గృహ కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.కనకారావు

డాబాగార్డెన్స్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఐఎల్ఓ కన్వెన్షన్ నంబర్ 189 ఒప్పందం ప్రకారం గృహ కార్మికులకు కనీస వేతనాలు, సామాజిక భద్రత, చట్టపరమైన రక్షణ వంటి హక్కులు కల్పించి సమగ్ర చట్టం చేయాలని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఫ్రీ ట్రేడ్ యూనియన్స్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు ఎస్.కనకారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 15వ అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం సందర్భంగా సీఎఫ్‌టీయూఐ ఆధ్వర్యంలో గృహ కార్మికుల సభ్యులతో డాబాగార్డెన్స్‌లోని ఓ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని కార్మిక సంఘాలలో అత్యధిక సంఖ్యలో గృహ కార్మికులను సీఎఫ్‌టీయూఐ ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక కార్మిక సంఘాలు, సామాజిక సంస్థల అవిశ్రాంత పోరాటాల కారణంగా 43 దేశాలు ఈ మైలురాయి ఒప్పందాన్ని అంగీకరిస్తూ గృహ కార్మికుల హక్కులను విస్తరించాయన్నారు. భారతదేశంలో గృహ కార్మికులకు చట్టపరమైన రక్షణ లేకపోవడంపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఒక ముఖ్యమైన ఉత్తర్వును జారీ చేసిందని తెలిపారు. గృహ కార్మికుల కోసం సమగ్ర జాతీయ చట్టాన్ని తక్షణమే రూపొందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కేజీహెచ్‌లో మద్యం సీసాలు!



కేజీహెచ్ ఆవరణలో మద్యం సీసా

మహారాణిపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నిరంతరం వేలాది మంది వైద్యసేవల కోసం ఆశ్రయించే కేజీహెచ్ ఆవరణలో మద్యం కంపు కొడుతోంది. కేజీహెచ్ ఆవరణలో మద్యం సీసాలు కనిపిస్తున్నాయి. ఆసుపత్రి సిబ్బందే విచ్చలవిడిగా మద్యం తాగుతున్నట్లు రోగులు, వారి బంధువులు ఆరోపిస్తున్నారు. రోగుల సహాయకుల పేరుతో బయట నుంచి వచ్చినవారు ఇక్కడ మద్యం తాగుతున్నారా? సిబ్బంది ప్రమేయం ఉందా? అన్నది విచారించాల్సి ఉంది. పర్యవేక్షక అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మద్యం మత్తులో ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడినా రోగులు ఇబ్బందులకు గురికావలసి ఉంటుంది ఆసుపత్రి ఆవరణలో వైద్య కళాశాల విద్యార్థినులు నర్సింగ్ విద్యార్థినుల హాస్టళ్లు ఉన్నాయి. మహిళా నర్సింగ్ సిబ్బంది ఉన్నారు. సమీపంలో ఉన్న కొందరు ఆకతాయిలు నిత్యం ఆసుపత్రి ప్రాంగణంలోకి స్వేచ్ఛగా వస్తూ పోతూ ఉంటారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి ఇలాంటి వ్యవహారాలను కట్టడి చేయాలని రోగులు, వారి సహాయకులు కోరుతున్నారు.

'స్టీల్‌ప్లాంట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి'

మహారాణిపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో అక్రమంగా తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని, వారిపై నిర్బంధం ఆపాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వీ కుమార్ డిమాండ్ చేశారు. కార్మికులకు మద్దతుగా సోమవారం జగదాంబ సెంటరులో అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాలు నిరసన కార్యక్రమం చేపట్టాయి. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడతామన్న కూటమి పెద్దలు కార్మికుల ఉపాధిని దెబ్బతీస్తే అడ్డుకోలేకపోయారని ఎద్దేవా చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో అదనంగా ఆరువేల మంది కార్మికులు అవసరమైనప్పటికీ విధుల్లో ఉన్న 4,500 మందిని అక్రమంగా తొలగించటాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. కార్మికులు తమ ఉపాధి రక్షణ కోసం పోరాడుతుంటే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కక్ష పూరితంగా వ్యవహరిస్తూ పోలీసులతో బెదిరించి ఉద్యమాన్ని అణచివేస్తున్నాయని అన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు, సెయిల్‌లో విలీనం వంటి డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని ఆరోపించారు. ఈ నెల 21న విశాఖకు వస్తున్న ప్రధాని మోదీ కార్మికుల ఉపాధి రక్షణపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మథరావు, పి.మణి, కె.దేవా, ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.

ముమ్మరంగా యోగాసనాల సాధన



మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్కులో యోగాసనాల సాధన చేస్తున్న ఔత్సాహికులు



రైల్వేస్టేషన్ ప్రధాన ద్వారం ఎదుట యోగా సాధన

విశాఖపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవ సన్నాహాలలో భాగంగా వాల్తేరు రైల్వే సోమవారం ఐఎన్ఎస్ విశ్వ కర్మ నావికాదళంతో కలిసి డివిజనల్ అధికారులు యోగా సాధన నిర్వహించింది. రైల్వే స్టేషన్ ప్రవేశ ద్వారం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో అనుభవజ్ఞులైన శిక్షకుల నేతృత్వంలో సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్లు కె.సందీప్, కె.పవన్‌కుమార్ (2), ఇతర అధికారులు, సిబ్బంది, నావికాదళానికి చెందిన 25 మంది అధికారులు పాల్గొని ధ్యాన పద్ధతులతో ప్రాణాయామం తదితర యోగాసనాలు వేశారు. యోగాసనాలతో కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో భాగంగా నావికాదళం అధికారులతో కలిసి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

మురళీనగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్కులో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ భాగస్వామ్యంతో సోమవారం యోగా సాధన చేశారు. సుమారు 500 మంది హాజరయ్యారు. వీరికి యోగాసనాల్లో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జోన్-5 జెడ్సీ బి.రాము అతిథిగా పాల్గొన్నారు. పార్కు నిర్వాహక బృందం ఏర్పాట్లను పర్యవేక్షించింది. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు పృథ్వీరాజ్, శంకర్ నారాయణ హాజరయ్యారు.

అధ్వానంగా డ్రైనేజీలు, కాల్వలు



కాల్వలో పేరుకుపోయిన చెత్త, మురుగునీరు

అక్కయ్యపాలెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డులోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీలు, కాల్వలు అధ్వానంగా ఉన్నాయి. వీటిని పారిశుధ్య కార్మికులు శుభ్రం చేయకుండా వదిలేస్తున్నారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలోని శివరామ స్వీట్స్ షాప్‌నకు ఆనుకుని ఉన్న కాల్వలో కొన్ని నెలల నుంచి మురుగు నీరు, చెత్త పేరుకుపోయింది. దీన్ని నెలలు గడిచినా పారిశుధ్య కార్మికులు తొలగించపోవడంతో స్థానికులు మండిపడుతున్నారు. వర్షం వస్తే ఆ కాల్వలోని మురుగు నీరు, చెత్త రోడ్డుపైకి వచ్చి అధ్వానంగా తయారవుతుంది. దీంతో వాహనచోదకులు, పాదచారులు ముక్కు మూసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. సచివాలయాల శానిటేషన్ సెక్రటరీల పర్యవేక్షణ లోపం వల్ల పారిశుధ్య కార్మికులు విధులు సక్రమంగా నిర్వహించడం లేదని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి కాల్వల్లో చెత్త తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

యోగాంధ్రకు 10,000 మందితో బందోబస్తు

(3వ పేజీ తరువాయి)

నుంచి వచ్చేవారు తమ వాహనాలతో తగరపువలస మీదుగా భీమిలి బీచ్‌కు చేరుకుని కేటాయించిన కంపార్టుమెంట్‌లకు చేరుకోవాల్సి ఉంటుంది.

●విజయనగరం నుంచి వచ్చేవారు బోయిపాలెం వద్ద ఎడమవైపు తిరిగి బీచ్‌రోడ్డుకు చేరుకుని వారికి కేటాయించిన కంపార్ట్‌మెంట్‌లకు చేరుకోవాల్సి ఉంటుంది.

●అనకాపల్లి, పెందుర్తి, వేపగుంట వైపుల నుంచి వచ్చేవారంతా తమ వాహనాలను అడవివరం, హనుమంతవాక, ఎండాడ, లా కాలేజీ రోడ్డు మీదుగా బీచ్‌రోడ్డులో వారికి కేటాయించిన కంపార్టుమెంట్‌లకు చేరుకోవల్సి ఉంటుంది.

●అల్లూరి జిల్లా నుంచి వచ్చేవారంతా బీఆర్‌టీఎస్ రోడ్డులో వేపగుంట, హనుమంతవాక మీదుగా ఎంవీపీ డబుల్ రోడ్డుకు చేరుకుని విశాఖ కంటి ఆస్పత్రి రోడ్డు ద్వారా లేదా విష్ణు హోండా జంక్షన్ మీదుగా మద్దిలపాలెం జంక్షన్‌కు చేరుకుని ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో వాహనాలను పార్కింగ్ చేసి కేటాయించిన ప్రాంగణాలకు వెళ్లాల్సి ఉంటుంది.

●ఆర్కే బీచ్ నుంచి భీమిలి బీచ్ వరకూ యోగాలో పాల్గొనేందుకు వచ్చేవారంతా జాతీయ రహదారి మీదుగా ప్రయాణం చేసి ఎంవీపీ డబుల్ రోడ్డు, వెంకోజీపాలెం, విశాఖ వ్యాలీస్కూల్, ఎండాడ, లాకాలేజీరోడ్డు, మారికవలస, బోయపాలెం ప్రాంతాల్లో గల మార్గాల ద్వారా బీచ్‌రోడ్డుకు చేరుకుని తమకు కేటాయించిన పార్కింగ్ స్థలాల్లో వాహనాలను నిలిపి, కేటాయించిన కంపార్టుమెంట్లలోకి వెళ్లాల్సి ఉంటుంది.

●యోగాంధ్ర నేపథ్యంలో 20వ తేదీ మధ్యాహ్నం నుంచి తగరపువలస జంక్షన్ నుంచి భీమిలి వైపు వాహనాలను మళ్లిస్తారు.

●ఆనందపురం ఫ్లైఓవర్ నుంచి నగరంలోకి భారీ వాహనాలను అనుమతించబడవు. ఆనందపురం జంక్షన్ నుంచి డైవర్షన్ తీసుకుని పెందుర్తి, అనకాపల్లి మీదుగా జాతీయ రహదారిపైకి వెళ్లాల్సి ఉంటుంది.

●అనకాపల్లి నుంచి వచ్చే భారీ వాహనాలు (నిత్యావసర వస్తువులు మినహా) నగరంలోకి ప్రవేశించడానికి వీల్లేదు.

●పెందుర్తి జంక్షన్ నుంచి నగరంలోకి భారీ వాహనాలు ప్రవేశం నిషిద్ధం

●మద్దిలపాలెం ఇంజనీరింగ్ కాలేజీ ఆర్చ్ నుంచి త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌వైపు వీవీఐపీ వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుంది.

●21న ఉదయం 11 గంటలకు యోగా చేసేవారి వాహనాలు తప్ప ఇతర వాహనాలు బీచ్ వైపు వెళ్లడానికి అనుమతించరు.

మెట్రో రైలు భూసేకరణ పనులకు శ్రీకారం

(3వ పేజీ తరువాయి)

అల్లిపురం, కంచరపాలెం, రేసపువానిపాలెం, మద్దిలపాలెం, వెంకోజీపాలెం, చినగదిలి, ఎండాడ, పోతినమల్లయ్యపాలెం, మధురవాడ, అల్లిపురం తదితర ప్రాంతాల్లో భూసేకరణ చేయాల్సి ఉంది. ఆ భూములు తీసుకుంటే నిర్వాసితులయ్యే వారి పరిస్థితి ఏమిటి?, సామాజిక ప్రభావం ఎంత ఉంటుంది?...అనే అంశాలు అంచనా వేయడానికి భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ కమిషనర్, జిల్లా కలెక్టర్ కలిసి రైజెస్ అనే బృందాన్ని ఏర్పాటుచేశారు. వీరు క్షేత్రస్థాయిలో పరిశీలించి నూతన భూసేకరణ చట్టం 2013 ప్రకారం నివేదిక ఇవ్వాలి. ఈ బృందం సోమవారం గాజువాక ప్రాంతంలో సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా బృంద సభ్యుడు ఆర్.దేవరాజు మాట్లాడుతూ భూములు కోల్పోయేవారు ఈ ప్రాజెక్టుకు సహకరించాలని కోరామని, వారి అభిప్రాయాలు, సలహాలు, సూచనలు ఏమైనా ఉంటే ప్రజాభిప్రాయ సేకరణలో తెలపవచ్చునన్నారు. వాటిని కూడా నివేదికలో పొందుపరిచి అధికారులకు సమర్పిస్తామన్నారు. ఈ సర్వేలో మెట్రో రైలు ప్రాజెక్టు డిప్యూటీ తహశీల్దార్ పద్మావతి, సర్వేయర్ శ్రీనుబాబు, ఇంజనీర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటును కాపాడిన ఘనత ఎన్‌డీఏదే..

(3వ పేజీ తరువాయి)

ఉన్న అభిమానమే కారణమన్నారు. ఉద్యోగులు ప్లాంటును శాశ్వతంగా రక్షించుకునేందుకు లాభాల బాటలో పయనించేలా చేయాలన్నారు. స్టీల్‌ప్లాంటు 20 వేల ఎకరాల్లో ఉందని, ఎకరా ఆరు కోట్లు చొప్పున చూసినా లక్ష కోట్లకుపైగా ఆస్తి ఉందన్నారు. దీన్ని కాపాడుకుని రాష్ట్రాభివృద్ధికి వినియోగించుకోవాలన్నారు. గత ప్రభుత్వం విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటుకు భూమి అడిగితే ఇవ్వలేదని చంద్రబాబునాయుడు ఆరోపించారు. అయితే, అభివృద్ధి విషయంలో తాము ఎక్కడా రాజీ పడకుండా భూమిని కేటాయించామన్నారు. ఎన్‌టీపీసీ అనకాపల్లి జిల్లాలో లక్షా 85 వేల కోట్లు రూపాయలతో గ్రీన్ హైడ్రోజన్ పవర్ ఉత్పత్తిచేసే ప్లాంటు ఏర్పాటుకు చర్యలు శ్రీకారం చుట్టిందని, నక్కపల్లిలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు మూడు, నాలుగు ఫార్మాస్యూటికల్ కంపెనీలు ముందుకు వచ్చాయన్నారు. వాటి వల్ల పెద్దఎత్తున స్థానిక యువతకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు.

ముంబైకి దీటుగా విశాఖ అభివృద్ధి

(3వ పేజీ తరువాయి)

పరుగులు పెట్టిస్తున్నామన్నారు. విశాఖ బ్రాండ్‌ను పెంచగలిగితే ఆకాశమే హద్దుగా అభివృద్ధి చెందుతుందన్నారు. విశాఖలో సివిల్ ఏవియేషన్ యూనివర్సిటీ కూడా ఏర్పాటు చేయబోతున్నట్టు ముఖ్యమంత్రి వెల్లడించారు. దీనివల్ల విమానాల్లో ఉద్యోగాలు చేసే స్థాయికి మన పిల్లలు చేరుకుంటారన్నారు. రాష్ట్రమంతా ఒక ఎత్తైతే...విశాఖ మరో ఎత్తన్నారు. భవిష్యత్తులో విశాఖకు మెట్రో రైలు వస్తుందని పేర్కొన్నారు. గతంలో తాను మెట్రోకు సంబంధించిన ప్రతిపాదనలను పెడితే...ఐదేళ్ల ఎక్కడి వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా పరిస్థితి ఉందన్నారు. విశాఖకు ఇప్పటికే టీసీఎస్ వచ్చిందని, త్వరలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటవుతుందన్నారు. ప్రపంచంలోని డేటాను విశాఖకు తెచ్చి ఏఐ సాయంతో విశ్లేషించనున్నట్టు తెలిపారు. ఇందుకు సింగపూర్ నుంచి విశాఖకు సముద్ర మార్గంలో కేబుల్ వేయనున్నట్టు చంద్రబాబునాయుడు వెల్లడించారు. అనకాపల్లి జిల్లాలో ఆర్సెల్ మిట్టల్ స్టీల్‌ప్లాంటు వస్తోందని, అది ఏర్పాటైతే అక్కడ స్టీల్ సిటీ ఏర్పాటవుతుందన్నారు.

ప్రభుత్వ భూముల తాకట్టు..

గత వైసీపీ పాలకులు విశాఖలోని ప్రభుత్వ ఆస్పత్రులు, కాలేజీలు, కలెక్టరేట్, తహశీల్దార్ కార్యాలయాలను తాకట్టు పెట్టేశారని చంద్రబాబు ఆరోపించారు. ఫైనాన్స్ కమిషన్ నుంచి రెండేళ్లకు రావాల్సిన డబ్బులను ముందుగానే డ్రా చేశారన్నారు. విశాఖలో భారీఎత్తున భూ కబ్జాలకు పాల్పడ్డారని, వైసీపీ పాలకులకు ఇష్టం లేని భూములను 22ఏలో పెట్టి ఇబ్బందులకు గురిచేశారన్నారు. అయితే, తాము అధికారంలోకి వచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేశామని, భూములు జోలికి వెళ్లాలంటే వెన్నులో వణుకు పుట్టేలా చర్యలు చేపట్టామన్నారు. భూమి రికార్డుల్లో మార్పులు చేయకుండా బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో వాటిని పరిరక్షించే ప్రయత్నం చేస్తున్నామన్నారు.

విశాఖ కేంద్రంగా ఎకనామిక్ హబ్..

విశాఖ కేంద్రంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం ఎకనామిక్ హబ్ అభివృద్ధి చేస్తామని సీఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు రిపోర్ట్ తయారైందన్నారు. కాకినాడ పోర్టు నుంచి మూలపేట పోర్టు వరకూ గల ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే బెస్ట్ ఎకమినామిక్ కారిడార్‌గా నిలుస్తుందన్నారు.

యోగాలో భాగస్వాములు కావాలి..

ఈ నెల 21న నిర్వహించనున్న యోగాంధ్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమంతో విశాఖను ప్రపంచపటంలో పెట్టే బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికీ మ్యాట్, టీ షర్ట్ ఇస్తామన్నారు. ప్రతిరోజూ ఇంటి వద్ద యోగా చేస్తే ఆరోగ్యంగా ఉండవచ్చునన్నారు. 45 నిమిషాలపాటు ఎంతమంది యోగా చేస్తారో చేతులు ఎత్తాలని చంద్రబాబు చెప్పగా.. అందరూ చేతులెత్తేశారు. దీనికి ఆయన నవ్వుతూ...తనపై ఒట్టేసి చెప్పాలని కోరడంతో అందరూ నవ్వుకున్నారు.

గుంత కనిపిస్తే మేయర్ పదవి గోవిందా.?

నగర పరిధిలో రోడ్లు బాగుండాలని, ఎక్కడా గుంత కనిపించకూడదని చంద్రబాబు నాయుడు అన్నారు. గుంత కనిపిస్తే మేయర్ పదవి గోవిందా అంటూ పీలా శ్రీనివాస్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించినప్పుడు అంతా నవ్వారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు లేచి ఎయిర్‌పోర్టులో మీపై దాడి జరిగిన వ్యవహారంపై దృష్టిసారించాలని కోరగా..తన దృష్టిలో ఉందని చంద్రబాబునాయుడు సమాధానమిచ్చారు. రాష్ట్రంలో గత ప్రభుత్వంలో అరాచకాలకు పాల్పడిన కొడాలి నాని, పేర్ని నానిలను అరెస్టు చేయాలని కొందరు, జగన్‌ను అరెస్ట్ చేయాలని మరికొందరు నినాదాలు చేశారు.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

యోగా దినోత్సవం సందర్భంగా నగరంలో జరుగుతున్న ఏర్పాటన్లు పరిశీలించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం విశాఖ వచ్చారు. ఆయనకు విమానాశ్రయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు ఘన స్వాగతం పలికారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి





ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న మంత్రులు బాల వీరాంజనేయస్వామి, గుమ్మిడి సంధ్యారాణి, కందుల దుర్గేష్, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్, ఎంపీలు శ్రీభరత్, సీఎం రమేష్, మేయర్ పి.శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్, వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్ రాజు, సుందరపు విజయకుమార్, బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, తదితరులు.



చెంగు చెంగున తిరుగుతున్న జింక

జూలో జింకల సందడి

ఆరిలోవ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలలో చుక్కల జింకలు సందడి చేశాయి. జింకలు నెమళ్ల మోటుల వద్ద గడ్డి మేయడానికి వచ్చాయి. అవి చెంగు చెంగున ఎగరడం చూపరులను ఆకట్టుకున్నాయి. సందర్శకులు వాటికి ఫొటోలు తీసి ఆనందించారు.

ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్తగా సింహాచలం



బాధ్యతలు స్వీకరిస్తున్న సింహాచలం

వెంకోజీపాలెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్తగా చిత్రకళ విభాగాధిపతి డి. సింహాచలం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు పలువురు ఆచార్యులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆచార్య హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

వీధి విక్రయదారులకు గుర్తింపు కార్డుల జారీకి దరఖాస్తులు

వెంకోజీపాలెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : వీధి విక్రయదారులకు గుర్తింపు కార్డుల జారీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జోన్-4 కమిషనర్ మల్లయ్యానాయుడు తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వీధి విక్రయదారుల చట్టం 2014 జీవో నెంబరు 137 ప్రకారం జీవీఎంసీ పరిధిలో ఉన్న తోపుడు బండ్లు, ఇతర వీధి విక్రయదారులకు గుర్తింపు కార్డులు అవసరమని చెప్పారు. అర్హులైన వారు ఈనెల 18వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

సినిమా గైడ్

- **డ్రాగన్ 3డి** : జగదాంబ
- **బల్లెరినా** : రమాదేవి
- **గేంబ్లర్స్** : శారద
- **థగ్ లైఫ్** : మెలోడి, సంగం, కామేశ్వరి, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **భైరవం**: శ్రీకన్య, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక)
- **సింగిల్** : గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 22, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 18, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 34, బీరకాయలు 30, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 20, క్యారెట్ 40 దొండకాయలు 20, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 54, అల్లం (పాతది) 52, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 70, బద్దచిక్కుడు 50, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 90, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 74, కీరదోస 30, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడ దుంపలు 30, కంద 56, దేముడు చిక్కుడు 56, గోరు చిక్కుడు 38, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర 4, తోటకూర 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు	బ్యాగ్
రైతు ధర	77
లైవ్ ధర	97
విత్ స్కిన్	164
స్కిన్‌లెస్	174

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సొంతం

» డిప్యూటీ కలెక్టర్ సత్య పద్మ

మద్దిలపాలెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : యోగా చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటామని డిప్యూటీ కలెక్టర్ సత్యపద్మ తెలిపారు. మద్దిలపాలెంలోని డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సోమవారం నిర్వహించిన యోగాంధ్ర ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ యోగా సాధన చేయాలన్నారు. యోగా ఆవశ్యకత తెలియజేసేలా ఈనెల 21న నగరంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొవాలని పిలుపునిచ్చారు. అనంతరం మద్దిలపాలెం ఏరియాలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు యోగాంధ్రలో పాల్గొనాలని అవగాహన కల్పించారు. ముందుగా కళాశాలలో విద్యార్థులతో యోగా ఆసనాలు వేయించారు. యోగాలో ప్రతిభ కనబరిచిన వారికి సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వేదవ్యాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కృష్ణ కళాశాల విద్యార్థులు

యోగాంధ్ర విజయవంతం చేయాలి

మద్దిలపాలెం : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 21న నగరంలో నిర్వహిస్తున్న యోగాంధ్ర దినోత్సవాన్ని విజయవంతం చేయాలని టీడీపీ పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ పిలుపునిచ్చారు. జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురంకాలనీలో సోమవారం 120 డ్వాక్రా గ్రూపుల మహిళలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యోగాంధ్రలో ప్రతి ఒక్క మహిళ పాల్గొనాలని కోరారు. ఈ వార్డు నుంచి 2వేల మంగి పైగా మహిళలు యోగాంధ్రకు హాజరుకావాలని కోరారు. పాల్గొనేవారికి యోగా మ్యాట్, టీషర్ట్ పంపిణీ చేస్తామని, అలాగే యోగా కంపార్టుమెంటులకు చేరుకోవడానికి రవాణ సదుపాయం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కంపార్ట్‌మెంట్‌లలో వాటర్, స్నాక్స్ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని హాజరై నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న డ్వాక్రా మహిళలు

జనసేనలో చేరిన వైసీపీ నాయకులు



పార్టీలో చేరిన వైసీపీ నాయకులతో ఎమ్మెల్యే వంశీ కృష్ణ

మద్దిలపాలెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 35వ వార్డుకు చెందిన వైసీపీ నాయకులు దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. శివాజీపాలెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం కాండ్రేగుల రూప, రామభూక్త సంతోషిని, కాండేగుల లక్ష్మీ, ఆకుల జయ, శివ తదితరులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి లభించిందన్నారు. కష్టపడి పనిచేసిన వారికి వైసీపీలో గుర్తింపు ఉండదని, వలస నేతల చుట్టూ తిరుగుతూ వారికే పదవులిస్తారని మండిపడ్డారు. కూటమిలో పనిచేసేవారికి మంచి భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఏయూ పరీక్షల విభాగం డీన్‌గా మునిస్వామి

వెంకోజీపాలెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఏయూ పరీక్షల విభాగంలో పీజీ, ప్రొఫెషనల్ కోర్సుల డీన్‌గా ఆచార్య బి. మునిస్వామి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్ నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్న అనంతరం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు వర్సిటీ ఆచార్యులు శుభాకాంక్షలు తెలిపారు.



మునిస్వామికి బాధ్యతలు అప్పగిస్తున్న వీసీ

బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాలను బాధితులకు అందిస్తున్న ప్రతాప్‌రుద్ర

ఎంవీపీ కాలనీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న ఏయూ అవుట్ గేట్ ప్రాంతానికి చెందిన మహ్మద్ అఫ్రోజుద్దీన్‌కు రూ.3.30 లక్షలు, చినవాల్తేరు తమిళ స్ట్రీట్‌కు చెందిన పసుమర్తి గణేశ్‌బాబుకు రూ.2.74 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. ఈమేరకు సోమవారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ క్యాంప్ కార్యాలయంలో వెలగపూడి ప్రతాప్‌రుద్ర బాధితులకు మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మంగవేణి, లావణ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడంలో ఆనందం

పెదవాల్తేరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : పేదలకు సేవ చేయడంలో ఆనందం ఉంటుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడే వెంకట పట్టాభిరామ్ పేర్కొన్నారు. సోమవారం తన పుట్టిన రోజు సందర్భంగా పెదవాల్తేరు హిడెన్ స్ప్రౌట్స్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో కేక్ కట్ చేసి, విద్యార్థులకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను ఎప్పుడూ పేద, బడుగు బలహీన వర్గాల మేలు కోసం పని చేస్తానని తెలిపారు. విద్యార్థుల మధ్య జన్మదినోత్సవ వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు పాఠశాల నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న పట్టాభిరామ్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహణ పనుల దృష్ట్యా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్ త్రీ ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయం ప్రాంతం, పెదగదిలి, చినగదిలి, సంతపాలెం, గాంధీనగర్, ఆరిలోవ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

అంగన్‌వాడీల నిరసన

సిరిపురం/ వెంకోజీపాలెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పెరిగి ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు కె. వెంకటలక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం దగ్గర సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ యూనియన్ తమకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధికార సర్వేలో చూపిస్తున్న ప్రభుత్వ ఉద్యోగి అన్న పదాన్ని తీసేయాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్‌లో చూపిస్తున్నట్టు తాము ప్రభుత్వ ఉద్యోగులం కాదని, కేవలం గౌరవ వేతనం ఇస్తున్నారని తెలిపారు. తమ సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షురాలు పి. మణి, బృందావతి, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇసుకతోట అంబేడ్కర్ కాలనీ అంగన్‌వాడీ-2వ కేంద్రంలో అంగన్‌వాడీ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి. శ్యామలాదేవి మాట్లాడారు. ప్రతి నెల 5వ తేదీకి గౌరవ వేతనాలు, బిల్లులు తమ ఖాతాల్లో జమ చేయాలని, పిల్లలకు వండి వడ్డించే మెనూ రేట్లు వెంటనే పెంచాలని, అంగన్వాడీ కేంద్రాలకు సరకులన్నీ ప్రభుత్వమే చేర్చాలని, ట్రాన్స్‌పోర్టు చార్జీలు ఇవ్వాలని, యాప్‌ను సవరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రమాదేవి, పి.కృపారాణి, రమ, రాజు తదితరులు పాల్గొన్నారు.



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

సీఐటీయూ నిరసన

తగరపువలస, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని, తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లో తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ నాయకులు తగరపువలస జాతీయ రహదారిపై సోమవారం నిరసన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ జేఏసీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తొలగించిన నాలుగు వేల మంది కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, ఉక్కు ఉద్యమంపై పోలీసుల నిర్బంధాన్ని ఆపు చేయాలని, కార్మిక నాయకులపై పెట్టిన అక్రమ కేసుల్ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జోన్ కార్యదర్శి మూర్తి, ఉపాధ్యక్షుడు అప్పలనాయుడు, రామోదర, బాబాజీ, జోగ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీలో ప్రమాదం

» కాంట్రాక్టు కార్మికురాలికి తీవ్ర గాయాలు

అక్కిరెడ్డిపాలెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీలో సోమవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఓ కాంట్రాక్టు కార్మికురాలికి గాయాలయ్యాయి. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్మాగారంలోని స్టెరిలైజ్ ఫ్లేవర్డ్ మిల్క్ (ఎస్‌ఎఫ్‌ఎం) విభాగంలో సోమవారం సాయంత్రం కొన్ని బాటిళ్లలో ఉష్ణోగ్రత అధికం కావడంతో ఒక్కసారిగా పేలిపోయాయి. ఆ సమయంలో సమీపంలో విధులు నిర్వహిస్తున్న లగుడు రాము (45)పై గాజుపెంకులతో పాటు వేడి పాలు పడ్డాయి. గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి సిబ్బంది తరలించారు. అనకాపల్లి జిల్లా మాకవరపాలేనికి చెందిన ఆమె ఇటీవలే విధుల్లో చేరినట్టు సిబ్బంది తెలిపారు.

ప్రమాదకరంగా ఫుట్‌పాత్‌పై పలక

ఆరిలోవ, జూన్ 16(ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డు కేంద్ర కారాగారానికి సమీపంలో ఉన్న శ్రీకృష్ణాపురం అంబేడ్కర్ గురుకులానికి వెళ్లే ఫుట్‌పాత్‌పై పలక విరిగిపోయింది. వారం రోజుల క్రితం జీవీఎంసీకి చెందిన మెషిన్ ఫుట్‌పాత్‌పై నుంచి వెళ్లింది. దీంతో అది విరిగిపోయిందని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయాన్ని గమనించని విద్యార్థులు, వృద్ధులు కాలువలో పడి గాయాలపాలవుతున్నారు.



కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించిన మంత్రులు

సిరిపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగా దినోత్సవం ఏర్పాట్లలో భాగంగా ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను మంత్రులు పి.నారాయణ, కొలుసు పార్థసారథి, ఎం.రాంప్రసాద్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వారు వివిధ జిల్లాల కలెక్టర్లు, అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. జిల్లాలకు కేటాయించిన లక్ష్యం మేరకు ప్రజల తరలింపు, రవాణా, వారికి కల్పిస్తున్న సదుపాయాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి జిల్లాకు కేటాయించిన గ్యాలరీకి ప్రజలను సకాలంలో తరలించాలని, పార్కింగ్ అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఎక్కడా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పని చేయాలని చెప్పారు. తాగునీరు, అల్పాహారం అందేలా చూడాన్నారు. అనంతరం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో వివిధ విభాగాలకు సంబంధించిన టీంలు ఏర్పాటు, కేటాయించిన విధులు గురించి తెలుసుకున్నారు.

ఉక్కు ప్రైవేటీకరణను నిలిపివేయాలి

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ ఆదినారాయణ

కూర్మన్నపాలెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు నగరానికి విచ్చేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో స్టీల్ ప్లాంట్ విక్రయాన్ని నిలుపుదల చేస్తున్నట్టు ప్రకటించేలా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు కృషి చేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి. ఆదినారాయణ కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1,586వ రోజుకు చేరాయి. ఇక్కడి దీక్షా శిబిరం కూలిపోవడంతో మండుటెండలో గొడుగులు వేసుకుని నాయకులు, కార్మికులు తమ దీక్షలను కొనసాగించారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ కార్మికులు అధికంగా ఉన్నారంటూ స్టీల్ ప్లాంట్ కోసం భూములిచ్చిన నిర్వాసితులకు, కాంట్రాక్టు కార్మికులను అక్రమంగా సుమారు 3,500 మందిని తొలగించడం దారుణమన్నారు. కాగా గత వారం రోజుల్లో నాలుగు వందలకు పైగా కాంట్రాక్టు కార్మికులను ఉక్కు యాజమాన్యం కొత్తగా విధుల్లోకి తీసుకున్నా స్థానిక ప్రజాప్రతినిధులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. తక్షణమే నూతన కార్మికుల నియామకాలను ఆపి, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.



కూర్మన్నపాలెంలో మాట్లాడుతున్న డి.ఆదినారాయణ

సీఐటీయూ జిల్లా నాయకుడు ఎన్.రామారావు మాట్లాడుతూ వర్షం కారణంగా దీక్షల వేదిక కూలి పోయిందని, మళ్లీ నిర్మించుకుంటామంటే ఉక్కు యాజమాన్యం ఫిర్యాదు మేరకు ప్రభుత్వ అధికారులు, పోలీసులు వీల్లేదని చెబుతున్నారన్నారు. అందువల్లే మండుటెండలో గొడుగులు వేసుకుని దీక్షలను కొనసా గిస్తున్నామన్నారు. ప్లాంట్ విక్రయ నిర్ణయాన్ని కేంద్రం ఉపసంహరించేంత వరకు దీక్షలను కొనసాగిస్తామ న్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కృషి చేయాలని కోరారు. నాయకులు సత్యనారాయణ, రామస్వామి, భానుమూర్తి, వెంకటరావు, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు ఘన స్వాగతం

గోపాలపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. సోమవారం మధ్యాహ్నం 12.16 గంటలకు గన్నవరం నుంచి నగరానికి చేరుకున్న ఆయనకు మంత్రులు డోలా, కె. పార్థసారథి, కొల్లు రవీంద్ర, అనిత, ఎంపీలు శ్రీభరత్, సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు గణబాబు, గంటా, వెలగపూడి, పంచకర్ల, విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయకుమార్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మేయర్ పీలా శ్రీనివాసరావు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి, తదితరులు స్వాగతం పలికారు.

22న ఎమ్మెల్యే కప్ టేబుల్ టెన్నిస్ టోర్నీ



ప్రచార పోస్టర్ ఆవిష్కరిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు తదితరులు

విశాఖపట్నం స్పోర్ట్సు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కప్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీని ఈ నెల 22న గోపాలపట్నంలోని ఇండోర్ స్పోర్ట్సు హాల్లో నిర్వహిస్తారు. ఈ టోర్నీ ప్రచార పోస్టర్‌ను పశ్చిమ శాసనసభ్యుడు గణబాబు సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించి నిర్వాహకులను అభినందించారు. ఈ టోర్నీ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం ప్రతినిధులు నాయక్, మురళి పాత్రో, మాజీ ఒలింపియన్ ఎంవీ మాణిక్యాలు పాల్గొన్నారు.

న్యూరో సర్జరీ విభాగానికి శస్త్రచికిత్స పరికరాల వితరణ



కేజీహెచ్ సూపరింటెండెంట్‌కు శస్త్రచికిత్స పరికరాలు అందజేస్తున్న ఆదిలక్ష్మి

మహారాణిపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్ న్యూరో సర్జరీ విభాగానికి సుంకర ఆదిలక్ష్మి తన తండ్రి సుంకర బాల పరమేశ్వరరావు జ్ఞాపకార్థం సోమవారం రూ.8 లక్షల విలువచేసే శస్త్రచికిత్స పరికరాలను వితరణగా ఇచ్చారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణికి ఈ పరికరాలను అప్పగించారు. ఈ సందర్భంగా డాక్టర్ వాణి మాట్లాడుతూ పరికరాలు న్యూరో సర్జరీ విభాగానికి ఎంతో ఉపయుక్తమని, రోగులకు మరిన్ని సేవలు అందించటానికి ఉపయోగపడతాయన్నారు.

సచివాలయాలు కిటకిట



తల్లికి వందనం దరఖాస్తుదారులతో రద్దీ

జ్ఞానాపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకంలో డబ్బులు పడని వారికి ప్రభుత్వం సోమవారం నుంచి విజ్ఞప్తి చేసుకునేందుకు అవకాశం కల్పించడంతో ఇబ్బందులు ఉన్న తల్లులు సచివాలయాల్లో నమోదుకు బారులు తీరారు. కానీ సర్వర్ పనిచేయకపోవడంతో మధ్యాహ్నం వరకు నిరీక్షించినవారు నిరాశతో వెనుదిరిగారు. కొంతమందికి ఇంట్లో ఇద్దరు ఉంటే ఒకరే అర్హులుగా డబ్బు పడడంతో వారు ఆందోళన చెందారు. అలానే తల్లికి వందనం పథకంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్న అర్హులైన విద్యార్థులకు డబ్బు అందకపోవడంతో వారు పెద్ద సంఖ్యలో సచివాలయాలకు చేరుకున్నారు.

జూలై 31న బీచ్‌రోడ్డులో క్రైస్తవుల పాదయాత్ర



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మత పెద్దలు

సీతంపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పరిపాలనలో క్రైస్తవులకు ప్రాధాన్యత ఇవ్వాలన్న కోరికతో జూలై 31న విశాఖ బీచ్ రోడ్డులో పాదయాత్ర నిర్వహిస్తామని ఆలిండియా ఐక్య క్రైస్తవ జాయింట్ యాక్షన్ కోర్ కమిటీ చైర్మన్ టి.బాబూరావు తెలిపారు. ద్వారకానగర్‌లోని ఎస్తేరు రాణి ఫౌండేషన్ ట్రస్ట్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలు సహా దేశంలో క్రైస్తవులకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ కేటాయించాలని కోరారు. దేశంలో గణనీయ సంఖ్యలో క్రైస్తవులు ఉన్నారని, వారికి సేవలందించే విద్య, వైద్యశాలలు, ప్రార్థన మందిరాలను కాపాడుకుంటామని స్పష్టం చేశారు. వైఎంసీ నుంచి వేలాది మంది క్రైస్తవులతో వేకువన 3 నుంచి 5 గంటల వరకు పాదయాత్ర చేపడతాని, అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బిషప్‌లు ఎ.బాలరాజు. ఎల్.శ్యామ్యూల్, బాబ్జి, కె.సాంబ శామ్యూల్, రమేష్, ఎస్తేరు రాణి ఫౌండేషన్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఎస్తేరు రాణి, సభ్యులు పాల్గొన్నారు.

‘కంచరపాలెం పాఠశాల విలీనం తగదు’



మెట్టు వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

కంచరపాలెం/ఆర్పీపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కంచరపాలెం ప్రాథమిక పాఠశాలను సమీపంలో గల ఆర్పీపేట ప్రాథమిక పాఠశాలలో విలీనం చేయవద్దని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. పాఠశాలల పునర్వ్యవస్థీకరణ చట్టంలో భాగంగా గత నెలలో కంచరపాలెం ప్రాథమిక పాఠశాలను బేసిక్ పాఠశాలగా మార్చి, ఇక్కడ చదువుతున్న 3, 4, 5 తరగతుల విద్యార్థులను ఆర్పీపేట ప్రాథమిక పాఠశాలలో విలీనం చేసి దానిని మోడల్ ప్రైమరీ పాఠశాలగా అధికారులు మార్చారు. అయితే కంచరపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు సంఖ్య బాగానే ఉందని, ఉపాధ్యాయులు, మౌలిక వసతులు కూడా అందుబాటులో ఉన్నప్పటికీ మరో పాఠశాలలో విలీనం చేయడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం వారు ఆందోళన చేయడంతో జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమకుమార్ పాఠశాలను సందర్శించి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పాఠశాలను ఆనుకుని ఉన్నత పాఠశాల ఉండడంతో కంచరపాలెం ప్రాథమిక పాఠశాలను ఆర్పీపేటలో విలీనం చేశామన్నారు. దీనిపై తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని, వారంలో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను తీసుకుంటామన్నారు. తల్లిదండ్రుల నిరసనకు సీపీఎం, సిటు నాయకులు మద్దతు తెలిపారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కంచరపాలెం పోలీసులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో ఎ.సోమేశ్వర్రావు, ఎంఈవో డి.దివాకర్ పాల్గొన్నారు.

వైద్య విద్యార్థుల మృతికి సంతాపం



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఆంధ్ర వైద్య కళాశాల విద్యార్థులు

మహారాణిపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విమాన ప్రమాదంలో వైద్య విద్యార్థుల మృతికి సంతాపం వ్యక్తంచేస్తూ ఆంధ్ర వైద్య కళాశాల విద్యార్థులు సోమవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 12న గుజరాత్‌లోని అహ్మదాబాద్ ఎయిర్ పోర్టు వద్ద జరిగిన ఘోర విమాన ప్రమాదంలో వైద్య విద్యార్థులు మృతి చెందిన విషయం తెలిసిందే. వారి మృతికి సంతాపంగా ఏఎంసీ విద్యార్థులు ఈ కార్యక్రమం నిర్వహించాయి. శ్రద్ధాంజలి ఘటించి, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, జుడా అధ్యక్షుడు డాక్టర్ షిరాజ్‌షా సహా వైద్య విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి



పుస్తకాలు అందిస్తున్న నాయకులు

అక్కయ్యపాలెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి అన్నారు. రైల్వేన్యూకాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను సోమవారం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించి మంచి ప్రయోజకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. టీడీపీ విశాఖ పార్లమెంటరీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అకిరెడ్డి జగదీష్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే ఆశయంతో ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. బాధ్యతలు స్వీకరించిన జీవీఎంసీ, కేఎస్ఎం ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు ఎస్వీ శేషకుమారి, శాంతికుమారిలను సత్కరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు పుష్కలం



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

డాబాగార్డెన్స్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలు పుష్కలంగా ఉంటాయని వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని దక్షిణ ఎమ్మెల్యే సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. సోమవారం డాబాగార్డెన్స్‌లోని రమాదేవి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా ఉపకరణాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తల్లికి వందనం ద్వారా పాఠశాలకు రూ.80 లక్షల వరకు జమ అయ్యిందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాఠశాలలో మొక్కలు పెంచాలని సూచించారు. బాగా చదువుకుని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు హితవు పలికారు. ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



41వవార్డులో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అల్లిపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కాన్వెంటు కూడలి వద్ద గల కాయగూరల టోకు మార్కెట్‌లో రూ.40.75 లక్షలతో సీసీ రోడ్లు, కాలువలు, ఇతర మౌలిక వసతులు, జ్ఞానాపురం శ్మశానవాటిక వద్ద రూ.48 లక్షల అంచనా వ్యయంతో మౌలిక సదుపాయాల కల్పన, పలు అభివృద్ధి పనులకు దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సోమవారం శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా కాయగూరల మార్కెట్‌లోని వర్తకుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పెరిగిన జనాభా అవసరాలకు అనుగుణంగా ఈ మార్కెట్‌ను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. మార్కెట్ ఆధునికీకరణ లేదా మరోచోట విశాలమైన ప్రాంతాన్ని కేటాయించి అభివృద్ధి చేస్తామన్నారు. జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, టీడీపీ, జనసేన, బీజేపీ 41వ వార్డు అధ్యక్షులు ఐతి మధుబాబు, అంతోని శేఖర్, సంజీవరావు, ఐతి రవిబాబు, భానోజీరావు, గవర రమణ, రాజ్‌కుమార్, ఏఈ సతీష్ పాల్గొన్నారు.

గృహ కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.కనకారావు

డాబాగార్డెన్స్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఐఎల్ఓ కన్వెన్షన్ నంబర్ 189 ఒప్పందం ప్రకారం గృహ కార్మికులకు కనీస వేతనాలు, సామాజిక భద్రత, చట్టపరమైన రక్షణ వంటి హక్కులు కల్పించి సమగ్ర చట్టం చేయాలని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఫ్రీ ట్రేడ్ యూనియన్స్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు ఎస్.కనకారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 15వ అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం సందర్భంగా సీఎఫ్‌టీయూఐ ఆధ్వర్యంలో గృహ కార్మికుల సభ్యులతో డాబాగార్డెన్స్‌లోని ఓ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని కార్మిక సంఘాలలో అత్యధిక సంఖ్యలో గృహ కార్మికులను సీఎఫ్‌టీయూఐ ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక కార్మిక సంఘాలు, సామాజిక సంస్థల అవిశ్రాంత పోరాటాల కారణంగా 43 దేశాలు ఈ మైలురాయి ఒప్పందాన్ని అంగీకరిస్తూ గృహ కార్మికుల హక్కులను విస్తరించాయన్నారు. భారతదేశంలో గృహ కార్మికులకు చట్టపరమైన రక్షణ లేకపోవడంపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్లతో కూడిన డివిజన్ బెంచ్ ఒక ముఖ్యమైన ఉత్తర్వును జారీ చేసిందని తెలిపారు. గృహ కార్మికుల కోసం సమగ్ర జాతీయ చట్టాన్ని తక్షణమే రూపొందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

‘స్టీల్‌ప్లాంట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి’

మహారాణిపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో అక్రమంగా తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని, వారిపై నిర్బంధం ఆపాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వీ కుమార్ డిమాండ్ చేశారు. కార్మికులకు మద్దతుగా సోమవారం జగదాంబ సెంటరులో అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాలు నిరసన కార్యక్రమం చేపట్టాయి. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడతామన్న కూటమి పెద్దలు కార్మికుల ఉపాధిని దెబ్బతీస్తే అడ్డుకోలేకపోయారని ఎద్దేవా చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో అదనంగా ఆరువేల మంది కార్మికులు అవసరమైనప్పటికీ విధుల్లో ఉన్న 4,500 మందిని అక్రమంగా తొలగించటాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. కార్మికులు తమ ఉపాధి రక్షణ కోసం పోరాడుతుంటే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కక్ష పూరితంగా వ్యవహరిస్తూ పోలీసులతో బెదిరించి ఉద్యమాన్ని అణచివేస్తున్నాయని అన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు, సెయిల్‌లో విలీనం వంటి డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని ఆరోపించారు. ఈ నెల 21న విశాఖకు వస్తున్న ప్రధాని మోదీ కార్మికుల ఉపాధి రక్షణపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మథరావు, పి.మణి, కె.దేవా, ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో మద్యం సీసాలు!



కేజీహెచ్ ఆవరణలో మద్యం సీసా

మహారాణిపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నిరంతరం వేలాది మంది వైద్యసేవల కోసం ఆశ్రయించే కేజీహెచ్ ఆవరణలో మద్యం కంపు కొడుతోంది. కేజీహెచ్ ఆవరణలో మద్యం సీసాలు కనిపిస్తున్నాయి. ఆసుపత్రి సిబ్బందే విచ్చలవిడిగా మద్యం తాగుతున్నట్లు రోగులు, వారి బంధువులు ఆరోపిస్తున్నారు. రోగుల సహాయకుల పేరుతో బయట నుంచి వచ్చినవారు ఇక్కడ మద్యం తాగుతున్నారా? సిబ్బంది ప్రమేయం ఉందా? అన్నది విచారించాల్సి ఉంది. పర్యవేక్షక అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మద్యం మత్తులో ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడినా రోగులు ఇబ్బందులకు గురికావలసి ఉంటుంది ఆసుపత్రి ఆవరణలో వైద్య కళాశాల విద్యార్థినులు నర్సింగ్ విద్యార్థినుల హాస్టళ్ల ఉన్నాయి. మహిళా నర్సింగ్ సిబ్బంది ఉన్నారు. సమీపంలో ఉన్న కొందరు ఆకతాయిలు నిత్యం ఆసుపత్రి ప్రాంగణంలోకి స్వేచ్ఛగా వస్తూ పోతూ ఉంటారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి ఇలాంటి వ్యవహారాలను కట్టడి చేయాలని రోగులు, వారి సహాయకులు కోరుతున్నారు.

ముమ్మరంగా యోగాసనాల సాధన



మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్కులో యోగాసనాల సాధన చేస్తున్న ఔత్సాహికులు



రైల్వేస్టేషన్ ప్రధాన ద్వారం ఎదుట యోగా సాధన

విశాఖపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవ సన్నాహాలలో భాగంగా వాల్తేరు రైల్వే సోమవారం ఐఎన్ఎస్ విశ్వ కర్మ నావికాదళంతో కలిసి డివిజనల్ అధికారులు యోగా సాధన నిర్వహించింది. రైల్వే స్టేషన్ ప్రవేశ ద్వారం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో అనుభవజ్ఞులైన శిక్షకుల నేతృత్వంలో సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్లు కె.సందీప్, కె.పవన్‌కుమార్ (2), ఇతర అధికారులు, సిబ్బంది, నావికాదళానికి చెందిన 25 మంది అధికారులు పాల్గొని ధ్యాన పద్ధతులతో ప్రాణాయామం తదితర యోగాసనాలు వేశారు. యోగాసనాలతో కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో భాగంగా నావికాదళం అధికారులతో కలిసి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

మురళీనగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్కులో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ భాగస్వామ్యంతో సోమవారం యోగా సాధన చేశారు. సుమారు 500 మంది హాజరయ్యారు. వీరికి యోగాసనాల్లో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జోన్-5 జెడ్సీ బి.రాము అతిథిగా పాల్గొన్నారు. పార్కు నిర్వాహక బృందం ఏర్పాట్లను పర్యవేక్షించింది. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు పృథ్వీరాజ్, శంకర్ నారాయణ హాజరయ్యారు.

అధ్వానంగా డ్రైనేజీలు, కాల్వలు



కాల్వలో పేరుకుపోయిన చెత్త, మురుగునీరు

అక్కయ్యపాలెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డులోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీలు, కాల్వలు అధ్వానంగా ఉన్నాయి. వీటిని పారిశుధ్య కార్మికులు శుభ్రం చేయకుండా వదిలేస్తున్నారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలోని శివరామ స్వీట్స్ షాప్‌నకు ఆనుకుని ఉన్న కాల్వలో కొన్ని నెలల నుంచి మురుగు నీరు, చెత్త పేరుకుపోయింది. దీన్ని నెలలు గడిచినా పారిశుధ్య కార్మికులు తొలగించపోవడంతో స్థానికులు మండిపడుతున్నారు. వర్షం వస్తే ఆ కాల్వలోని మురుగు నీరు, చెత్త రోడ్డుపైకి వచ్చి అధ్వానంగా తయారవుతుంది. దీంతో వాహనచోదకులు, పాదచారులు ముక్కు మూసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. సచివాలయాల శానిటేషన్ సెక్రటరీల పర్యవేక్షణ లోపం వల్ల పారిశుధ్య కార్మికులు విధులు సక్రమంగా నిర్వహించడం లేదని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి కాల్వల్లో చెత్త తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

యోగాంధ్రకు 10,000 మందితో బందోబస్తు

(3వ పేజీ తరువాయి)

నుంచి వచ్చేవారు తమ వాహనాలతో తగరపువలస మీదుగా భీమిలి బీచ్‌కు చేరుకుని కేటాయించిన కంపార్టుమెంట్‌లకు చేరుకోవాల్సి ఉంటుంది.

●విజయనగరం నుంచి వచ్చేవారు బోయిపాలెం వద్ద ఎడమవైపు తిరిగి బీచ్‌రోడ్డుకు చేరుకుని వారికి కేటాయించిన కంపార్ట్‌మెంట్‌లకు చేరుకోవాల్సి ఉంటుంది.

●అనకాపల్లి, పెందుర్తి, వేపగుంట వైపుల నుంచి వచ్చేవారంతా తమ వాహనాలను అడవివరం, హనుమంతవాక, ఎండాడ, లా కాలేజీ రోడ్డు మీదుగా బీచ్‌రోడ్డులో వారికి కేటాయించిన కంపార్టుమెంట్‌లకు చేరుకోవల్సి ఉంటుంది.

●అల్లూరి జిల్లా నుంచి వచ్చేవారంతా బీఆర్‌టీఎస్ రోడ్డులో వేపగుంట, హనుమంతవాక మీదుగా ఎంవీపీ డబుల్ రోడ్డుకు చేరుకుని విశాఖ కంటి ఆస్పత్రి రోడ్డు ద్వారా లేదా విష్ణు హోండా జంక్షన్ మీదుగా మద్దిలపాలెం జంక్షన్‌కు చేరుకుని ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో వాహనాలను పార్కింగ్ చేసి కేటాయించిన ప్రాంగణాలకు వెళ్లాల్సి ఉంటుంది.

●ఆర్కే బీచ్ నుంచి భీమిలి బీచ్ వరకూ యోగాలో పాల్గొనేందుకు వచ్చేవారంతా జాతీయ రహదారి మీదుగా ప్రయాణం చేసి ఎంవీపీ డబుల్ రోడ్డు, వెంకోజీపాలెం, విశాఖ వ్యాలీస్కూల్, ఎండాడ, లాకాలేజీరోడ్డు, మారికవలస, బోయపాలెం ప్రాంతాల్లో గల మార్గాల ద్వారా బీచ్‌రోడ్డుకు చేరుకుని తమకు కేటాయించిన పార్కింగ్ స్థలాల్లో వాహనాలను నిలిపి, కేటాయించిన కంపార్టుమెంట్లలోకి వెళ్లాల్సి ఉంటుంది.

●యోగాంధ్ర నేపథ్యంలో 20వ తేదీ మధ్యాహ్నం నుంచి తరగపువలస జంక్షన్ నుంచి భీమిలి వైపు వాహనాలను మళ్లిస్తారు.

●ఆనందపురం ఫ్లైఓవర్ నుంచి నగరంలోకి భారీ వాహనాలను అనుమతించబడవు. ఆనందపురం జంక్షన్ నుంచి డైవర్షన్ తీసుకుని పెందుర్తి, అనకాపల్లి మీదుగా జాతీయ రహదారిపైకి వెళ్లాల్సి ఉంటుంది.

●అనకాపల్లి నుంచి వచ్చే భారీ వాహనాలు (నిత్యావసర వస్తువులు మినహా) నగరంలోకి ప్రవేశించడానికి వీల్లేదు.

●పెందుర్తి జంక్షన్ నుంచి నగరంలోకి భారీ వాహనాలు ప్రవేశం నిషిద్ధం

●మద్దిలపాలెం ఇంజనీరింగ్ కాలేజీ ఆర్చ్ నుంచి త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌వైపు వీఐపీ వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుంది.

●21న ఉదయం 11 గంటలకు యోగా చేసేవారి వాహనాలు తప్ప ఇతర వాహనాలు బీచ్ వైపు వెళ్లడానికి అనుమతించరు.

మెట్రో రైలు భూసేకరణ పనులకు శ్రీకారం

(3వ పేజీ తరువాయి)

అల్లిపురం, కంచరపాలెం, రేసపువానిపాలెం, మద్దిలపాలెం, వెంకోజీపాలెం, చినగదిలి, ఎండాడ, పోతినమల్లయ్యపాలెం, మధురవాడ, అల్లిపురం తదితర ప్రాంతాల్లో భూసేకరణ చేయాల్సి ఉంది. ఆ భూములు తీసుకుంటే నిర్వాసితులయ్యే వారి పరిస్థితి ఏమిటి?, సామాజిక ప్రభావం ఎంత ఉంటుంది?...అనే అంశాలు అంచనా వేయడానికి భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ కమిషనర్, జిల్లా కలెక్టర్ కలిసి రైజెస్ అనే బృందాన్ని ఏర్పాటుచేశారు. వీరు క్షేత్రస్థాయిలో పరిశీలించి నూతన భూసేకరణ చట్టం 2013 ప్రకారం నివేదిక ఇవ్వాలి. ఈ బృందం సోమవారం గాజువాక ప్రాంతంలో సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా బృంద సభ్యుడు ఆర్.దేవరాజు మాట్లాడుతూ భూములు కోల్పోయేవారు ఈ ప్రాజెక్టుకు సహకరించాలని కోరామని, వారి అభిప్రాయాలు, సలహాలు, సూచనలు ఏమైనా ఉంటే ప్రజాభిప్రాయ సేకరణలో తెలపవచ్చునన్నారు. వాటిని కూడా నివేదికలో పొందుపరిచి అధికారులకు సమర్పిస్తామన్నారు. ఈ సర్వేలో మెట్రో రైలు ప్రాజెక్టు డిప్యూటీ తహశీల్దార్ పద్మావతి, సర్వేయర్ శ్రీనుబాబు, ఇంజనీర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటును కాపాడిన ఘనత ఎన్‌డీఏదే..

(3వ పేజీ తరువాయి)

ఉన్న అభిమానమే కారణమన్నారు. ఉద్యోగులు ప్లాంటును శాశ్వతంగా రక్షించుకునేందుకు లాభాల బాటలో పయనించేలా చేయాలన్నారు. స్టీల్‌ప్లాంటు 20 వేల ఎకరాల్లో ఉందని, ఎకరా ఆరు కోట్లు చొప్పున చూసినా లక్ష కోట్లకుపైగా ఆస్తి ఉందన్నారు. దీన్ని కాపాడుకుని రాష్ట్రాభివృద్ధికి వినియోగించుకోవాలన్నారు. గత ప్రభుత్వం విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటుకు భూమి అడిగితే ఇవ్వలేదని చంద్రబాబునాయుడు ఆరోపించారు. అయితే, అభివృద్ధి విషయంలో తాము ఎక్కడా రాజీ పడకుండా భూమిని కేటాయించామన్నారు. ఎన్‌టీపీసీ అనకాపల్లి జిల్లాలో లక్షా 85 వేల కోట్లు రూపాయలతో గ్రీన్ హైడ్రోజన్ పవర్ ఉత్పత్తిచేసే ప్లాంటు ఏర్పాటుకు చర్యలు శ్రీకారం చుట్టిందని, నక్కపల్లిలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు మూడు, నాలుగు ఫార్మాస్యూటికల్ కంపెనీలు ముందుకు వచ్చాయన్నారు. వాటి వల్ల పెద్దఎత్తున స్థానిక యువతకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు.

ముంబైకి దీటుగా విశాఖ అభివృద్ధి

(3వ పేజీ తరువాయి)

పరుగులు పెట్టిస్తున్నామన్నారు. విశాఖ బ్రాండ్‌ను పెంచగలిగితే ఆకాశమే హద్దుగా అభివృద్ధి చెందుతుందన్నారు. విశాఖలో సివిల్ ఏవియేషన్ యూనివర్సిటీ కూడా ఏర్పాటు చేయబోతున్నట్టు ముఖ్యమంత్రి వెల్లడించారు. దీనివల్ల విమానాల్లో ఉద్యోగాలు చేసే స్థాయికి మన పిల్లలు చేరుకుంటారన్నారు. రాష్ట్రమంతా ఒక ఎత్తైతే...విశాఖ మరో ఎత్తన్నారు. భవిష్యత్తులో విశాఖకు మెట్రో రైలు వస్తుందని పేర్కొన్నారు. గతంలో తాను మెట్రోకు సంబంధించిన ప్రతిపాదనలను పెడితే...ఐదేళ్లు ఎక్కడి వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా పరిస్థితి ఉందన్నారు. విశాఖకు ఇప్పటికే టీసీఎస్ వచ్చిందని, త్వరలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటవుతుందన్నారు. ప్రపంచంలోని డేటాను విశాఖకు తెచ్చి ఏఐ సాయంతో విశ్లేషించనున్నట్టు తెలిపారు. ఇందుకు సింగపూర్ నుంచి విశాఖకు సముద్ర మార్గంలో కేబుల్ వేయనున్నట్టు చంద్రబాబునాయుడు వెల్లడించారు. అనకాపల్లి జిల్లాలో ఆర్సెల్ మిట్టల్ స్టీల్‌ప్లాంటు వస్తోందని, అది ఏర్పాటైతే అక్కడ స్టీల్ సిటీ ఏర్పాటవుతుందన్నారు.

ప్రభుత్వ భూముల తాకట్టు..

గత వైసీపీ పాలకులు విశాఖలోని ప్రభుత్వ ఆస్పత్రులు, కాలేజీలు, కలెక్టరేట్, తహశీల్దార్ కార్యాలయాలను తాకట్టు పెట్టేశారని చంద్రబాబు ఆరోపించారు. ఫైనాన్స్ కమిషన్ నుంచి రెండేళ్లకు రావాల్సిన డబ్బులను ముందుగానే డ్రా చేశారన్నారు. విశాఖలో భారీఎత్తున భూ కబ్జాలకు పాల్పడ్డారని, వైసీపీ పాలకులకు ఇష్టం లేని భూములను 22ఏలో పెట్టి ఇబ్బందులకు గురిచేశారన్నారు. అయితే, తాము అధికారంలోకి వచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేశామని, భూముల జోలికి వెళ్లాలంటే వెన్నులో వణుకు పుట్టేలా చర్యలు చేపట్టామన్నారు. భూమి రికార్డుల్లో మార్పులు చేయకుండా బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో వాటిని పరిరక్షించే ప్రయత్నం చేస్తున్నామన్నారు.

విశాఖ కేంద్రంగా ఎకనామిక్ హబ్..

విశాఖ కేంద్రంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం ఎకనామిక్ హబ్ అభివృద్ధి చేస్తామని సీఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు రిపోర్ట్ తయారైందన్నారు. కాకినాడ పోర్టు నుంచి మూలపేట పోర్టు వరకూ గల ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే బెస్ట్ ఎకమినామిక్ కారిడార్‌గా నిలుస్తుందన్నారు.

యోగాలో భాగస్వాములు కావాలి..

ఈ నెల 21న నిర్వహించనున్న యోగాంధ్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమంతో విశాఖను ప్రపంచపటంలో పెట్టే బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికీ మ్యాట్, టీషర్ట్ ఇస్తామన్నారు. ప్రతిరోజూ ఇంటి వద్ద యోగా చేస్తే ఆరోగ్యంగా ఉండవచ్చునన్నారు. 45 నిమిషాలపాటు ఎంతమంది యోగా చేస్తారో చేతులు ఎత్తాలని చంద్రబాబు చెప్పగా.. అందరూ చేతులెత్తేశారు. దీనికి ఆయన నవ్వుతూ...తనపై ఒట్టేసి చెప్పాలని కోరడంతో అందరూ నవ్వుకున్నారు.

గుంత కనిపిస్తే మేయర్ పదవి గోవిందా.?

నగర పరిధిలో రోడ్లు బాగుండాలని, ఎక్కడా గుంత కనిపించకూడదని చంద్రబాబు నాయుడు అన్నారు. గుంత కనిపిస్తే మేయర్ పదవి గోవిందా అంటూ పీలా శ్రీనివాస్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించినప్పుడు అంతా నవ్వారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు లేచి ఎయిర్‌పోర్టులో మీపై దాడి జరిగిన వ్యవహారంపై దృష్టిసారించాలని కోరగా...తన దృష్టిలో ఉందని చంద్రబాబునాయుడు సమాధానమిచ్చారు. రాష్ట్రంలో గత ప్రభుత్వంలో అరాచకాలకు పాల్పడిన కొడాలి నాని, పేర్ని నానిలను అరెస్టు చేయాలని కొందరు, జగన్‌ను అరెస్ట్ చేయాలని మరికొందరు నినాదాలు చేశారు.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నగరంలో జరుగుతున్న ఏర్పాటన్లు పరిశీలించేందుకు సోమవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విశాఖ చేరుకున్నారు. ఆయనకు విమానాశ్రయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు ఘన స్వాగతం పలికారు.



ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న మంత్రులు బాల వీరాంజనేయస్వామి, గుమ్మిడి సంధ్యారాణి, కందుల దుర్గేష్, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్, ఎంపీలు శ్రీభరత్, సీఎం రమేష్, మేయర్ పి.శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్, వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్ రాజు, సుందరపు విజయకుమార్, బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ తదితరులు.

విశాఖ డెయిరీలో ప్రమాదం

కాంట్రాక్టు కార్మికురాలికి తీవ్ర గాయాలు

అక్కిరెడ్డిపాలెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీలో సోమవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఓ కాంట్రాక్టు కార్మికురాలికి తీవ్ర గాయాలయ్యాయి. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్మాగారంలోని స్టెరిలైజ్డ్ ఫ్లేవర్డ్ మిల్క్ (ఎస్ఎఫ్ఎం) విభాగంలో సోమవారం సాయంత్రం కొన్ని బాటిళ్లలో ఉష్ణోగ్రత అధికం కావడంతో ఒక్కసారిగా పేలిపోయాయి. మంటలను అగ్నిమాపక సిబ్బంది ఆపివేశారు. ఆ సమయంలో సమీపంలో విధులు నిర్వహిస్తున్న లగుడు రాము(45)పై గాజు పెంకులతో పాటు వేడి పాలు పడ్డాయి. గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి సిబ్బంది తరలించారు. అనకాపల్లి జిల్లా మాకవరపాలేనికి చెందిన ఆమె ఇటీవలే విధుల్లో చేరినట్టు సిబ్బంది తెలిపారు.

విద్యామిత్ర కిట్ల పంపిణీ

పెందుర్తి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపురం, చినముషిడివాడ శాంతినగర్‌లో గల జడ్పీ పాఠశాలల్లోని విద్యార్థులకు సోమవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను పంపిణీ చేశారు. చినముషిడివాడలో కార్పొరేటర్ సేనాపతి వసంత, రాంపురంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి నారాయణరావు విద్యార్థులకు విద్యామిత్ర కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా సంస్కరణలను చేపట్టి విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. ఎంపీటీసీ గండి హిమబిందు, టీడీపీ సీనియర్ నాయకుడు సేనాపతి శంకరరావు, హెచ్ఎం రాము, తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్: జీవీఎంసీ 88వ వార్డు పరిధి యాదవజగ్గరాజుపేట ఎంపీపీ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను టీడీపీ జిల్లా నాయకుడు గొలగాని సన్యాసిరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పిల్లలను ఉన్నత స్థాయికి చేరేలా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. అర్హులందరికీ 'తల్లికి వందనం' అందిస్తూ.. విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వం వివిధ పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. హెచ్ఎం ఈ.సతీశ్, కమిటీ చైర్మన్ దేవి, స్థానిక నాయకులు రమణ, అప్పారావు, గంగరాజు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **డ్రాగన్ 3డి** : జగదాంబ
- **బల్లెరినా** : రమాదేవి
- **గేంబ్లర్స్** : శారద
- **థగ్ లైఫ్** : మెలోడి, సంగం, కామేశ్వరి, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లలిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **భైరవం**: శ్రీకన్య, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక)
- **సింగిల్** : గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 22, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 18, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 34, బీరకాయలు 30, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 36, క్యాబేజీ 20, క్యారెట్ 40, దొండకాయలు 20, బంగాళదుంపలు 19, అరటికాయ (పెద్దది) 10, మునక్కాడలు (కిలో) 54, అల్లం (పాతది) 52, బరబాటి 30, ముల్లంగి 24, బద్దచిక్కుడు 50, నిమ్మకాయలు (కిలో) 70, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 90, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 74, కీరదోస 30, క్యాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 30, దేముడుచిక్కుడు 56, కంద 56, గోరుచిక్కుడు 38, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, కర్రపెండలం 18, బూడిద గుమ్మడికాయ 20, బొప్పాయి 30, మామిడి అల్లం 56, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	77
లైవ్ ధర	97
విత్ స్కిన్	164
స్కిన్‌లెస్	174

ఉక్కు అమ్మకాన్ని నిలిపివేస్తున్నట్టు మోదీతో ప్రకటింపజేయాలి

- ఆ దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కృషి చేయాలి
- కొత్తగా చేపట్టిన కార్మికుల నియామకాలను నిలిపివేసి తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలి
- ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ
- మండుటెండలో గొడుగులు వేసుకుని దీక్షలను కొనసాగిస్తున్న నాయకులు



కూర్మన్నపాలెంలో మాట్లాడుతున్న డి.ఆదినారాయణ

కూర్మన్నపాలెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు నగరానికి విచ్చేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో స్టీల్ ప్లాంట్ విక్రయాన్ని నిలుపుదల చేస్తున్నట్టు ప్రకటించేలా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు కృషి చేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1,586వ రోజుకు చేరాయి. ఇక్కడి దీక్షా శిబిరం కూలిపోవడంతో మండుటెండలో గొడుగులు వేసుకుని నాయకులు, కార్మికులు తమ దీక్షలను కొనసాగించారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ కార్మికులు అధికంగా ఉన్నారంటూ స్టీల్ ప్లాంట్ కోసం భూములిచ్చిన నిర్వాసితులకు, కాంట్రాక్టు కార్మికులను అక్రమంగా సుమారు 3,500 మందిని తొలగించడం దారుణమన్నారు. కాగా గత వారం రోజుల్లో నాలుగు వందలకు పైగా కాంట్రాక్టు కార్మికులను ఉక్కు యాజమాన్యం కొత్తగా విధుల్లోకి తీసుకున్నా స్థానిక ప్రజాప్రతినిధులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. తక్షణమే నూతన కార్మికుల నియామకాలను ఆపి, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్.రామారావు మాట్లాడుతూ వర్షం కారణంగా దీక్షల వేదిక కూలిపోయిందని, మళ్లీ నిర్మించుకుంటామంటే ఉక్కు యాజమాన్యం పిర్యాదు మేరకు ప్రభుత్వ అధికారులు, పోలీసులు వీల్లేదని చెబుతున్నారన్నారు. అందువల్లే మండుటెండలో గొడుగులు వేసుకుని దీక్షలను కొనసాగిస్తున్నామన్నారు. ప్లాంట్ విక్రయ నిర్ణయాన్ని కేంద్రం ఉపసంహరించేంత వరకు దీక్షలను కొనసాగిస్తామన్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కృషి చేయాలని కోరారు. నాయకులు సత్యనారాయణ, రామస్వామి, భానుమూర్తి, వెంకటరావు, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా యోగా డే

టీడీపీ 'గాజువాక' పరిశీలకుడు, తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ

గాజువాక, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం చరిత్రలో నిలిచిపోతుందని టీడీపీ గాజువాక నియోజకవర్గ పరిశీలకుడు, తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గాజువాకలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ పాల్గొంటున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, ఇందుకోసం యోగా సాధన చేయాలని సూచించారు. యోగా దినోత్సవ కార్యక్రమంలో గాజువాక నుంచి అధిక సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలతో పాటు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనవలసిందిగా కోరారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు పల్లా శ్రీనివాస్, గంధం శ్రీనివాస్, బొండా జగన్, బొడ్డు నరసింహపాత్రుడు, రాజాన రామారావు, నాయకులు విల్లా రామ్మోహన్‌కుమార్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మోదకొండమ్మ సారె ఊరేగింపు



అమ్మవారి సారె ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

గోపాలపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరానగర్‌లో శ్రీమోదకొండమ్మ పండగలో భాగంగా సోమవారం తొలేళ్ల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి సారె, ప్రతిమలను, ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. మంగళవారం వేకువజామున అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేయడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యాన్ని కల్పిస్తామన్నారు. భక్తులు ఇబ్బందులు పడకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేశారు.

మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలానికి నివాళి

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే, శ్రమశక్తి అవార్డు గ్రహీత పల్లా సింహాచలం మృతి కార్మిక వర్గానికి తీరని లోటు అని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు అన్నారు. గాజువాకలోని టీడీపీ కార్యాలయంలో పల్లా సింహాచలం చిత్రపటానికి సోమవారం ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లా సింహాచలం కార్మిక వర్గానికి విశేష సేవలందించారని, ఆయన చేసిన మేలును కార్మిక వర్గం మరచిపోదన్నారు. కార్యక్రమంలో నాయకులు నమ్మి సింహాద్రి, గుమ్మడి నరేంద్రకుమార్, పి.సోమినాయుడు, రఘుప్రసాద్, సత్యనారాయణ, పెంటారావు, చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

శిథిలమైన కాలువలు: ప్రజలకు తప్పని తిప్పలు



భానోజీ కాలనీలో కాలువ పాడైపోవడంతో పేరుకుపోయిన మురుగు

పెదగంట్యాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 65వ వార్డు పరిధి భానోజీ కాలనీలోని మురుగు కాలువలు శిథిలావస్థకు చేరాయి. పలుచోట్ల కాలువ గట్టు అంచులు లోపలకు పడిపోవడంతో మురుగు నీరు సక్రమంగా ముందుకు పారడం లేదు. భానోజీ కాలనీ ప్రధాన రహదారి పక్కన, వీధి రోడ్లకు ఇరుపక్కలా ఉన్న కాలువల పరిస్థితి ఇదే మాదిరిగా ఉండడంతో మురుగు తిష్ట వేసి తీవ్ర దుర్వాసన వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాల క్రితం అప్పటి జనావాసాలను దృష్టిలో పెట్టుకుని గాజువాక మునిసిపాలిటీ, ఆ తరువాత జీవీఎంసీ ఈ డ్రైనేజీలను నిర్మించింది. వీటికి ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టకపోవడం, ప్రస్తుత జనాభాకు అనుగుణంగా వీటిని విస్తరించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలువలు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఏ మాత్రం వర్షం కురిసినా నీరంతా రహదారులపై పారుతుందని, దీంతో వీధులన్నీ చెత్తమయంగా మారుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు, పాలకవర్గం స్పందించి కాలువలను పునర్నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

బోరింగ్ ప్రారంభం

సింధియా, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 62వ వార్డు పరిధి త్రినాథపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి బోరింగును కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో అనేక అభివృద్ధి జరుగుతున్నా యన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సత్యనారాయణ, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులకు స్వాగతం



ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న విద్యార్థులు

అగనంపూడి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి పినమడకలో నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వ ఆదర్శ పాఠశాలకు ముగ్గురు ఉపాధ్యాయులు నియమితులయ్యారు. ప్రధానోపాధ్యాయినిగా జ్యోతితో పాటు ఉపాధాయులు చిన్నమ్మడు, శాంతికుమారిలు సోమవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పాఠశాల కమిటీ ప్రతినిధులు ఉపాధ్యాయులకు ఘనంగా స్వాగతం పలికి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. విద్యాభివృద్ధికి కృషి చేయడంతో పాటు పాఠశాల అభివృద్ధికి పాటుపడతామని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ ప్రతినిధులు సంతోషి, సంధ్యారాణి, స్థానిక నాయకులు మంగరాజు, హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఏడీ కేవీలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఎన్.ఎ.డి.జంక్షన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎన్ఏడీ క్వార్టర్స్‌లో గల కేంద్రీయ విద్యాలయంలో పదో తరగతి, ప్లస్-2లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ స్నేహలత ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్‌లో ప్రవేశానికి 9వ తరగతిలో 55 శాతం, ప్లస్-2లో ప్రవేశానికి పదో తరగతిలో 55 శాతం మార్కులు వచ్చి ఉండాలని, అలాగే కేంద్రీయ విద్యాలయ నిబంధనలకు కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు. పదో తరగతిలో 31 సీట్లు, ప్లస్-2లో 24 ఖాళీలు ఉన్నాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పాఠశాలలో రెడీనెస్ మేళా ప్రారంభం

సింధియా, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 62వ వార్డు పరిధి దుర్గానగర్‌లోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో సోమవారం రెడీనెస్ మేళాను కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం మార్గదర్శకాలకు అనుగుణంగా చిన్నారుల్లో చదువు పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు పాఠశాల వాతావరణానికి సన్నద్ధత కల్పించడమే స్కూల్ రెడీనెస్ మేళా ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెద్దాడ హరికృష్ణ, సూపర్‌వైజర్ సత్యవతి, ప్రథమ జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీనివాస్‌లాల్, డాక్టర్ చింతా ప్రభాకర్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మేహాద్రి గెడ్డ వద్ద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

పెందుర్తి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మేహాద్రి గెడ్డ రిజర్వాయరులో సరదాగా ఈతకు దిగి యువత మృత్యువాత పడుతున్న నేపథ్యంలో పోలీసులు పటిష్ఠ చర్యలు చేపట్టారు. రిజర్వాయర్ వద్ద ప్రమాదకర లోతట్టు ప్రాంతాలను గుర్తించి, ఆ ప్రదేశంలో ఈతకు దిగరాదని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా సీఐ కేవీ సతీశ్‌కుమార్ డ్రోన్ కెమెరాలతో మేహాద్రి రిజర్వాయర్ వద్ద భద్రతను పెంచారు. దీంతో సోమవారం రిజర్వాయర్ పరివాహక ప్రమాద ప్రదేశంలో కొంతమంది యువకులు ఈతకు దిగినట్టు గుర్తించారు. ఈ మేరకు ఆయన వెంటనే పోలీసులను రిజర్వాయర్ వద్దకు పంపించి ఆ యువకులను హెచ్చరించడంతో పాటు కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ రేపు

పెందుర్తి-రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఈ నెల 18న ఉపాధి హామీ పథక సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తునట్టు ఎంపీడీవో గుండాల అప్పలరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 15 పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనులపై గ్రామాల్లో సామాజక తనిఖీ చేపట్టడం జరిగిందని, దీనిపై సోషల్ ఆడిటింగ్‌కు ప్రజా వేదిక సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

రక్తదానం చేసి ప్రాణ దాతలు కావాలి

వీఎస్ఈజడ్ డెవలప్‌మెంట్ కమిషనర్ ముప్పాళ్ల శ్రీనివాస్



కార్యక్రమంలో పాల్గొన్న ముప్పాళ్ల శ్రీనివాస్, తదితరులు

కూర్మన్నపాలెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని వీఎస్ఈజడ్ డెవలప్‌మెంట్ కమిషనర్ ముప్పాళ్ల శ్రీనివాస్ అన్నారు. వీఎస్ఈజడ్‌లో సోమవారం లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అన్ని దానాలలో రక్తదానం గొప్పదన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారెందరో రక్తం అందక మృత్యువాత పడుతున్నారని, అటువంటి వారిని కాపాడేందుకు రక్తదాతలు ముందుకు రావాలని కోరారు. రక్తదానం పట్ల అపోహలను యువత విడనాడాలని సూచించారు. రక్తదాతలకు అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన సంస్థ ఉద్యోగులు, వివిధ కర్మాగారాల కార్మికులు, సిబ్బంది, రక్తదాతలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జేడీసీ రోషిణి అపరంజి కొరాటి, ఏడీసీ ప్రసన్నకుమార్, నాయక్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

కొండవాలులోని మెట్ల మార్గాన్ని విస్తరిస్తాం

65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు



కొండవాలు ప్రాంతాల ప్రజలతో మాట్లాడుతున్న బొడ్డు నరసింహపాత్రుడు

పెదగంట్యాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 65వ వార్డు పరిధి రాజీవ్ రోడ్డు కొండవాలు ప్రాంత ప్రజలు రాకపోకలకు వీలుగా మెట్ల మార్గాన్ని విస్తరిస్తామని కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు అన్నారు. కొండవాలు ప్రాంతంలో సుమారు 200 కుటుంబాల వారు దశాబ్దాల కాలంగా నివసిస్తున్నారు. అయితే మూడు అడుగుల మెట్ల మార్గం మాత్రమే ఉండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నామని కార్పొరేటర్ దృష్టికి తమ సమస్యలను తీసుకువెళ్లారు. దీంతో ఆయన సోమవారం ఇక్కడి మెట్ల మార్గాన్ని జీవీఎంసీ అధికారులతో పాటు పరిశీలించారు. కొండవాలు ప్రాంతం నుంచి రోడ్డుకు వచ్చేందుకు తాము పడుతున్న ఇబ్బందులను స్థానికులు కార్పొరేటర్‌కు, జీవీఎంసీ అధికారులకు వివరించారు. ఈ మెట్ల మార్గాన్ని వీలైనంత మేర విస్తరించేందుకు కృషి చేస్తానని నరసింహపాత్రుడు వారికి హామీ ఇచ్చారు. ఇందుకోసం మెట్ల మార్గానికి ఇరుపక్కలా ఉంటున్న ప్రజలు కొంత స్థలాన్ని ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అందుకు వారంతా అంగీకరించారు. దీంతో త్వరలోనే పనులు ప్రారంభిస్తామని కార్పొరేటర్ పేర్కొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు



క్రీడాకారులలో స్టీల్ ప్లాంట్ జీఎం (స్పోర్ట్స్) టీకే ఘోశ్, తదితరులు

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): హరియానాలో సోమవారం నుంచి 25 వరకు జరగనున్న అండర్ -17 (జూనియర్) బాలుర నేషనల్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొననున్న క్రీడాకారులు సాయి కౌశిక్, కిరణ్ సాయిలను స్టీల్ ప్లాంట్ జీఎం (స్పోర్ట్స్) టీకే ఘోశ్, పలువురు అధికారులు సోమవారం అభినందించారు. ప్లాంట్ క్రీడా విభాగంలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీలకు స్టీల్ ప్లాంటు నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపికవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ పోటీల్లో పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బాక్సింగ్ కోచ్ కె.శ్రీనివాసరావు, అధికారులు ఏకే గడాయి, ఎంవీ మురళీమోహన్ పాల్గొన్నారు.

విద్యార్థులను చైతన్యపరచాలి

మల్కాపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సామాజిక చైతన్య కార్యక్రమాల ద్వారా విద్యార్థులను చైతన్యపరిచి దేశాభివృద్ధికి కృషి చేసేలా చూడాలని సెయింట్ ఆన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అన్నారు. కళాశాలలో రెండు రోజులుగా విద్యార్థులు నిర్వహిస్తున్న సామాజిక చైతన్య సేవ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం ఆమె పాల్గొని మాట్లాడారు. ఇందులో భాగంగా మొక్కలు నాటడం, యోగాపై శిక్షణ, పోక్సో చట్టంపై అవగహన, వ్యక్తిగత పరిశుభ్రత, మానవత విలువలపై సెమినార్ నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ కేస్లిన్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ సిస్టర్ జానీస్, జాతీయసేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సేవకులకు సత్కారం

అగనంపూడి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి పద్మ మార్కండేయ సేవా సంఘంలో సభ్యులుగా ఉంటూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్న పచ్చారి ప్రభావతి, రామలక్ష్మణ దంపతులను సోమవారం సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అగనంపూడి, ఉక్కు నిర్వాసిత కాలనీల్లో వారు చేపట్టిన సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు కొలిపాక అప్పారావు, ప్రతినిధులు బి.హనుమంతరావు, డి.దేముడు, గుదే సుశీల గజేంద్రరరావు, ప్రసాద్, రాజు, వరలక్ష్మి, కనకమహాలక్ష్మి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రకు సన్నద్ధం

- ఏర్పాట్లను పరిశీలించిన సీఎం చంద్రబాబు
- అధికారులకు కీలక సూచనలిచ్చిన ముఖ్యమంత్రి

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈనెల 21న ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం నగరంలో ఏర్పాట్లను పరిశీలించి, సూచనలు ఇచ్చారు. గిన్నిస్ రికార్డు సాధనకు కృషి జరుగుతోందని, దీనికి ప్రజలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు సహకరించాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీతో సహా పలువురు ప్రముఖులు పాల్గొనే యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు.


బీచ్‌రోడ్డులోని కాళీమాత ఆలయం వద్ద ఏర్పాట్లను ముఖ్యమంత్రికి వివరిస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు


కాన్వాయ్‌లోంచి ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం చంద్రబాబు


ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సమావేశ వేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు


ఏయూలో యోగాంధ్ర ఏర్పాట్లను సీఎంకు వివరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్



యోగాంధ్ర సమావేశంలో పాల్గొన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు లోకేశ్, అనిత


ప్రజల నుంచి సమస్యల వినతిపత్రాలను స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



నోవాటెల్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి, వేదికపై మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు



ఏడాదిలో విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనుల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి వీరాంజనేయస్వామి, ఎమ్మెల్యేలు




హోటల్ నోవాటెల్‌లో నిర్వహించిన యోగాంధ్ర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబునాయుడు, హాజరైన ప్రజా ప్రతినిధులు, అధికారులు


పల్లా సింహాచలం చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఏఎస్ రాజా మైదానంలో పార్కింగ్

ఎంవీపీ కాలనీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న నిర్వహించనున్న మహా క్రతువుకు అధికారులు పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నారు. ఎంవీపీ కాలనీ అప్పుఘర్ రోడ్డులో యోగా జరగనున్న నేపథ్యంలో వాహనాల పార్కింగ్‌కు ఏఎస్‌రాజా మైదానాన్ని సిద్ధం చేస్తున్నారు. వాతావరణంలో మార్పులు సంభవిస్తే ఈ మైదానాన్ని యోగాకు వినియోగించే అవకాశాలను పరిశీలిస్తున్నారు. ముడసర్లోవ రిజర్వాయరును ఆనుకుని ఉన్న ఈస్ట్ పాయింట్ గల్ఫ్ క్లబ్‌లో 50 వేల మంది యోగా చేసేందుకు అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు.

నినాదాలతో హోరెత్తిన టీడీపీ సభ

- జగన్‌ను జైలుకు పంపాలని డిమాండ్
- వైసీపీ దోషులను వదలొద్దు

విశాఖపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది తరువాత పోతినమల్లయ్యపాలెంలోని వి కన్వెన్షన్ హాల్లో ఉమ్మడి జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశం సోమవారం రాత్రి జరిగింది. సమావేశానికి మూడు గంటలు ఆలస్యంగా సీఎం చంద్రబాబునాయుడు హాజరయ్యారు. అయినా కార్యకర్తల్లో ఉత్సాహం తగ్గలేదు. సీఎం రాగానే నినాదాలు చేయడంతో సభ హోరెత్తింది. ఐదు నిమిషాలపాటు ఏకధాటిగా సీఎం జిందాబాద్, సీబీఎన్ జై అంటూ నినాదాలు చేయడంతో చంద్రబాబు వేదిక నుంచి ఆపండి అంటూ సైగ చేశారు. చంద్రబాబు మాట్లాడినంత సేపు కార్యకర్తలు నినాదాలు చేశారు. వైసీపీ ప్రస్తావన రాగానే గత ప్రభుత్వంలో తప్పులుచేసిన వారిని జైలుకు పంపాలని కొందరు నినందించారు. ఈ దశలో కార్యకర్తల నినాదాలు సరిగ్గా వినబడకపోవడంతో సీఎం ఒకరిద్దరిని చూసి ఇప్పుడు చెప్పాలనగానే ముందు జగన్‌ను జైలుకు పంపాలని ఒకరు డిమాండ్ చేశారు. మరొకరు లేచి ఎయిర్‌పోర్టులో మీపై దాడిచేసిన వారిని వదలొద్దని కోరారు. వెనుక నుంచి మరికొందరు కొడాలినాని, పేర్ని నాని సంగతి తేల్చండని కోరారు. విశాఖ ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతున్నప్పుడు జై బాలయ్య అంటూ నినాదాలు చేశారు. సమావేశం నిర్వహించే హాలు కార్యకర్తలతో కిక్కిరిసిపోయింది. లోపల స్థలం లేకపోవడంతో చాలామంది బయట ఉండిపోవడంతో వారి కోసం లైవ్ స్క్రీన్లు ఏర్పాటుచేశారు. విపక్షంలో ఉండగా రెండేళ్ల క్రితం ఇదే హాలులో ఉత్తరాంధ్ర జోన్ సమావేశం నిర్వహించామని చంద్రబాబు గుర్తుచేశారు. ఉమ్మడి విశాఖ జిల్లా నేతలందరినీ ఒకే వేదికపై చూడడం ఆనందంగా ఉందన్నారు.



ఉమ్మడి జిల్లా కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ అధినేత చంద్రబాబు

భారీ మెజారిటీతో బాధ్యత పెరిగింది: ఎం శ్రీభరత్

గత ఏడాది జరిగిన ఎన్నికల్లో ఐదు లక్షలకు మించి మెజారిటీతో విశాఖ ప్రజలు తనను గెలిపించారని, దీంతో మరింత బాధ్యత పెరిగిందని ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబుపై ఉన్న నమ్మకం, వైసీపీపై వ్యతిరేకత అత్యధిక మెజారిటీ అందించిందన్నారు. ప్రజాభిమానం, కార్యకర్తల కృషి ఎప్పటికీ మరచిపోలేనన్నారు. రెండోసారి కూడా పార్టీ అధికారంలోనికి వచ్చినపుడు అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. ఈనెల 21న జరగనున్న యోగా ప్రదర్శనలో ఆర్కేబీచ్ నుంచి భీమిలి వరకు యోగాసనాలు వేస్తే ప్రపంచం చూపు విశాఖపై పడుతుందన్నారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు విశాఖ మానస పుత్రికగా అన్నారు. నగరాభివృద్ధికి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ చూపుతారన్నారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ యోగా దినోత్సవంలో పాల్గొనున్న అనకాపల్లి ప్రజలకు 20వ తేదీ రాత్రి నగర శివారు ప్రాంతాలలో వసతి ఏర్పాటుచేయాలని కోరారు. పార్టీ విశాఖ అధ్యక్షుడు గండి బాబ్జీ నామినేటెడ్ పదవులు వెంటనే భర్తీచేయాలని కోరారు. అనకాపల్లి పార్లమెంటు అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు మాట్లాడుతూ విశాఖ పేరు ప్రపంచానికి తెలిసేలా యోగా దినోత్సవం నిర్వహణలో భాగస్వామ్యులు కావాలన్నారు. సభకు పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి దామచర్ల సత్య అధ్యక్షత వహించగా మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, కేఎస్ఎన్ఎస్. రాజు, ఎమ్మెల్సీ చిరంజీవరావు, మేయరు పీలా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు పప్పల చలపతిరావు, జి.రామానాయుడు, గిడ్డి ఈశ్వరి, మణికుమారి, నియోజకవర్గ ఇన్‌చార్జిలు సీతంరాజు సుధాకర్, ప్రగడ నాగేశ్వరరావు, దొన్నుదొర, జీసీసీ, వీఎంఆర్‌ఆర్‌డీఏ చైర్మన్లు కిడారి శ్రావణ్‌కుమార్, ప్రణవ్‌గోపాల్‌తోపాటు కోరాడ రాజబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలువురి నుంచి సీఎం వినతులు స్వీకరించారు.

కారును ఢీకొట్టిన టిప్పర్ లారీ


దెబ్బతిన్న కారు

మాధవధార, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బిర్లా జంక్షన్ హైవే సర్వీసు రోడ్డులో సోమవారం లోడుతో వెళుతున్న టిప్పర్ లారీ అటుగా వస్తున్న కారును ఢీకొట్టింది. ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు. మర్రిపాలెం నుంచి నగరానికి వెళ్తున్న కారును లారీ రాసుకుంటూ కొంత దూరం వెళ్లింది. దీంతో కారు ముందు భాగం, లారీ ఢీకొట్టిన వైపు ధ్వంసమైంది. ఆ సమయంలో కారులో నలుగురు ఉన్నారు. కారు నడుపుతున్నవారు అప్రమత్తంగా వ్యవహరించడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. కంచరపాలెం ట్రాఫిక్ సీఐ దాశరధి పర్యవేక్షణలో ప్రమాద ఘటనపై పోలీసు సిబ్బంది వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు. ప్రమాదంతో హైవే బిర్లా జంక్షన్ సర్వీస్ రోడ్డులో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

విశాఖపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గంజాయిని రైలులో బెంగళూరు తరలిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం అరెస్టు చేశారు. అతడి నుంచి 2.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నగరానికి చెందిన ముని రాజేష్ జ్ఞానాపురం రైల్వేస్టేషన్ ఆర్చ్‌వద్ద గంజాయితో ఉన్నట్లు ఏసీ వి.మహేష్‌కుమార్‌కు సమాచారం అందింది. దీంతో సీతమ్మధార ఎక్సైజ్ సీఐ సీహెచ్ రాజేశ్వరి బృందంతో వెళ్లి నిందితుడి బ్యాగ్‌లో రెండు ప్యాకెట్ల గంజాయిని స్వాధీనం చేసుకుని విచారించగా ఒడిశాలోని దర్లిపుట్‌లో రూ.ఐదు వేలకు కొనుగోలు చేసి, బెంగళూరు తరలిస్తున్నట్టు అంగీకరించడంతో అతడిని అరెస్టు చేశారు.

బస్టాప్‌లో అనాథ శిశువు


శిశువును కేజీహెచ్‌కు తరలిస్తున్న దృశ్యం

ఆనందపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మానవత్వం మంటగలిపిన సంఘటన మండలంలోని శిర్లపాలెం కూడలిలో చోటుచేసుకొంది. అప్పుడే పుట్టిన బిడ్డను గుర్తుతెలియని వ్యక్తి అనంతవరం బస్టాప్‌లో వదిలేసినట్టు భావిస్తున్నారు. శిశువును గుర్తించిన గ్రామస్థులు సపర్యలు చేశారు. పోలీసులకు సమాచారం అందడంతో విచారణ చేపట్టారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పార్వతి, పోలీసుల ఆధ్వర్యంలో 108 వాహన సిబ్బంది తిరుపతి, బంగార్రాజు శిశువుకు ప్రథమ చికిత్స అందించి, కేజీహెచ్‌కు తరలించారు.

విశాఖ పోర్టుకు సీఎస్ఆర్ అవార్డులు


అవార్డులతో పోర్టు చైర్మన్, విభాగాధిపతులు

విశాఖపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టు అథారిటీకి రెండు ప్రతిష్ఠాత్మక సీఎస్ఆర్ అవార్డులు లభించాయి. ఇటీవల ఢిల్లీలో జరిగిన 11వ వార్షిక గ్రీన్‌టెక్ అవార్డ్స్ -2025లో పోర్టు యాజమాన్యం వాటిని అందుకుంది. ఈ మేరకు సోమవారం పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు సంబంధిత విభాగాధిపతులకు అవార్డులను అందజేశారు. ఆరోగ్యసంరక్షణ ప్రోత్సాహం, నైపుణ్యాభివృద్ధి విభాగాల్లో చేపట్టిన కార్యక్రమాలకుగాను అవార్డులు లభించాయన్నారు.

విద్యుదాఘాతంతో వాచ్‌మన్ మృతి

పెందుర్తి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై వాచ్‌మన్ మృతి చెందినట్టు సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపారు. అనకాపల్లి జిల్లా కె.కోటపాడుకు చెందిన అనపర్తి అప్పారావు (60) మరిడిమాంబ ఆలయ సమీపంలో నిర్మాణ స్థలంలో వాచ్‌మన్. సోమవారం బోరింగ్ వద్ద విద్యుత్ షాక్‌కు గురయ్యారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో పాదచారుల వంతెన మూసివేత

విశాఖపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విశాఖ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా దక్షిణ వైపుగల మూడో నంబరు ప్రవేశ ద్వారం వద్ద పాదచారుల వంతెనను తాత్కాలికంగా మూసివేస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. వంతెనను ప్లాట్‌ఫామ్ 6, 7, 8లకు విస్తరించేందుకు పనులు చేపట్టామన్నారు. అందుబాటులో ఉన్న మిగిలిన రెండు పాదచారుల వంతెనలు, లిఫ్టులు ప్రయాణికులు ఉపయోగించుకోవాలని సూచించారు. డీఆర్‌ఎం లలిత్ బొహ్రా సోమవారం స్టేషన్‌లో పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రయాణికులు సహకరించాలన్నారు.

అప్పన్నను దర్శించుకున్న మంత్రి కొల్లు


కప్పస్తంభం వద్ద మంత్రి

సింహాచలం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్, మైనింగ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర సోమవారం సింహాచలంలోని వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఏఈఓ నక్క ఆనందకుమార్ ఆహ్వానం పలికారు. కప్పస్తంభ ఆలింగనం చేసుకున్న మంత్రి గోత్రనామాలతో అంతరాలయం లో అర్చకులు పూజలు చేసి, శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి దర్శనం అనంతరం పండితులు వేదాశీర్వచనాలు ఇచ్చారు. ఏఈఓ మంత్రిని శాలువతో సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.